PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 44 సంచిక : 8 | విజయవాడ, గురువారం 8 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 8 August 2024 | Rs

ప్రైవేటుకు ఎయిర్‌పోర్టులు!

- విజయవాడ, రాజమండ్రి, తిరుపతి విమానాశ్రయాల అప్పగింత?

2



సిటీ◆ వినేశ్ ఫొగాట్‌ను ఓదార్చుతున్న భారత ఒలింపిక్ సంఘం(ఐఓఎ) అధ్యక్షురాలు పిటి ఉష

గుండె పగిలింది!

- వినేష్ ఫొగాట్‌పై అనర్హత వేటు
- దిగ్భ్రాంతిలో దేశం

పారిస్: భారత క్రీడాభిమానుల గుండె పగిలింది. రెజ్లింగ్‌లో పతకం కోసం కన్న కలలు కల్లలైనాయి పారిస్ వేదికగా వినేష్ ఫొగాట్ స్వర్ణ పతకంతో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి తీరుతుందన్న ఆశలు గల్లంతైనాయి. తుది సమరం కోసం దేశం మొత్తం ఎదురుచూస్తున్న వేళ, ఆ పోరాటానికి కొన్ని గంటల ముందు భారత పుత్రికపై అనర్హత వేటు వేస్తున్నట్లు ఒలింపిక్ కమిటీ, అంతర్జాతీయ రెజ్లింగ్ కమిటీలు ప్రకటించాయి. బుధవారం రాత్రి ఫైనల్ పోరు జరగాల్సి ఉండగా మధ్యాహ్నం ఈ ప్రకటన వెలువడింది. నిర్ధేశించిన బరువు కన్నా వంద గ్రాముల బరువు ఎక్కువగా ఉండటంతో వినేష్ ఫొగాట్‌ను పోటీలకు అనర్హురాలిగా నిర్ణయించారన్నది ఈ ప్రకటన సారంశం! సంబరాలకు సిద్ధమౌతున్న వేళ అనూహ్యంగా వెలువడిన ఈ ప్రకటనతో దేశం దిగ్భ్రాంతికి గురైంది. సోషల్ మీడియలో వినేష్ ఫొగాట్‌కు సంఘీభావం చెబుతూ పోస్టులు వెల్లువెత్తాయి. గత ఏడాది చోటుచేసుకున్న పరిణామాలను గుర్తుచేస్తూ ఈ నిర్ణయం వెనుక కుట్ర కోణం ఉందన్న అనుమానాలను పలువురు ఈ పోస్టుల్లో వ్యక్తం చేశారు. 'బారత రెజ్లర్లపై ఏదో కుట్ర జరుగుతోంది. కొంతమంది మన సంతోషాన్ని చూడలేకపోతున్నారు.' అని ఒలింపిక్ మెడలిస్టు విజేందర్ సింగ్ పేర్కొన్నారు. రాత్రికి రాత్రి బరువు పెరగడంపై భారత రెజ్లింగ్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) అధ్యక్షుడు సంజయ్ సింగ్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వమూ స్పందించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'ఛాంపియన్లకే ఛాంపియన్' అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కేంద్ర క్రీడల శాఖ మంత్రి లోక్‌సభలో ప్రకటన చేశారు. ' ఈ నిర్ణయంలో కుట్ర ఏమీ లేదు. ఇది కేవలం సాంకేతిక అంశం' అని అథ్లెటిక్స్ ఫెడరేషన్ పేర్కొంది. వేటు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని భారత రెజ్లర్ ఫెడరేషన్ అప్పీల్ చేసింది.

ఏం జరిగింది...?

పారిస్ ఒలింపిక్స్‌లో వినేష్ ఫొగాట్ 50 కిలోల విభాగంలో పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. పోటీలు జరిగే రోజు క్రీడాకారులను తూచి వారి బరువును నిర్ధారించుకుంటారు. మంగళవారం మూడు బౌట్స్‌ల్లో పాల్గొని గెలిచిన వినేష్ నిర్ధేశిత ప్రమాణాల్లోనే ఉంది. అయితే, బుధవారానికి ఆ పరిస్థితి మారింది. నిర్దేశించిన బరువుకన్నా 100 గ్రాములు ఎక్కువగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు వేయాలని నిర్ణయించారు. మంగళవారం రాత్రి ఆమె 2.7 కిలోలు ఎక్కువ బరువు ఉన్నట్లు గుర్తించామని, దీంతో బరువు తగ్గించడానికి రాత్రంతా ప్రయత్నించామని, అయినా 50 కిలోల విభాగంలో 100 గ్రాములు ఎక్కువ బరువుఉన్నట్లు తేలిందని భారత బృందం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్షా పార్ధీవాలా వెల్లడించారు. అనర్హత ప్రకటన తరువాత డీ హైడ్రేషన్‌కు గురైన వినేష్‌ను క్రీడా ప్రాంగణంలోని ఆస్పత్రికి తరలించారు. సాధారణంగా 53 కిలోల విభాగంలో పోటీ పడే వినేష్ ఒలింపిక్స్‌లో 50 కిలోల విభాగంలో బరిలోకి దిగడంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు!

- చట్ట సవరణకు రంగం సిద్ధం
- ఎంపిలకు బిల్లు ప్రతుల పంపిణీ

న్యూఢిల్లీ : యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫీషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్, 1995ని ఈ వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి కేంద్రం రంగం సిద్ధం చేసింది. 'ఏదైనా ఒక ఆస్తి వక్ఫ్ ఆస్తి అవునా, కాదా అని నిర్ణయించడానికి బోర్డుకు గల అధికారాలకు సంబంధించిన సెక్షన్ 40ని తొలగించి' ప్రతిపాదిత చట్టాన్ని రూపొందించారు.

కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిములు, ముస్లిమేతరులకు ప్రతిపాదిత చట్టం ప్రాతినిధ్యం కల్పిస్తుంది. ఈ బిల్లు ప్రతులను బుధవారం లోక్‌సభ సభ్యులకు అందజేశారు. "బొహ్రాలు, అఘాఖానీలకు ప్రత్యేకంగా అకఫ్ బోర్డు ఏర్పాటుకు ఈ బిల్లు వెసులుబాటు కల్పిస్తోంది. షియా, సున్ని, బొహ్రా, అగాఖాని, ముస్లిం కమ్యూనిటీల్లోని ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు కూడా హామీ ఇస్తోంది.

జస్టిస్ (రిటైర్డ్) రాజిందర్ సచార్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులు, వక్ఫ్, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదికలను ఆధారంగా చేసుకుని ఇతర పక్షాలతో కూడా సవివరమైన సంప్రదింపులు జరిపిన తర్వాత 2013లో ఈ చట్టానికి సమగ్రమైన సవరణలు తీసుకొచ్చినట్లు బిల్లు లక్ష్యాలపై చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. సవరణలు చేసినప్పటికీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల అధికారాలకు సంబంధించిన సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు ఈ చట్టాన్ని మరింత మెరుగుపరచాల్సిన అవసరముందని ఆ ప్రకటన పేర్కొంది. వక్ఫ్ నిర్వచనంతో సహా వక్ఫ్ ఆస్తుల నమోదు, సర్వే, ఆక్రమణల తొలగింపునకు సంబంధించిన అంశాలను పరిష్కరించాలంటే చట్టానికి మరింత పదును పెట్టాల్సిన అవసరముందని భావించినట్లు ఆ ప్రకటన పేర్కొంది.

ఇస్లామిక్ చట్టం కింద మతపరమైన లేదా దాతృత్వ ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఆస్తుల సంరక్షణను వక్ఫ్ చూస్తుంది. ప్రస్తుతం వక్ఫ్ బోర్డుల కింద 8.7 లక్షల ఆస్తులు వున్నాయి. వీటి విలువ రూ.1.2 లక్షల కోట్లు. దేశవ్యాప్తంగా 9.4 లక్షల ఎకరాల్లో ఈ ఆస్తులు విస్తరించి వున్నాయి. సాయుధ బలగాలు, ఇండియన్ రైల్వేస్ తర్వాత మూడో స్థానంలో అత్యధికంగా భూములను కలిగివుంది. ఈ చట్టాన్ని చివరిసారిగా 2013లో సవరించారు. వక్ఫ్‌కు మిగతా 7లో

22(ఎ) భూముల రిజిస్ట్రేషన్లు

మూడునెలలు నిలిపివేత

- క్యూ ఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలు
- అక్టోబరు1నుంచి నూతన మద్యం పాలసీ
- మంత్రివర్గ నిర్ణయాలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 22(ఎ) కింద ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను మూడు నెలల పాటు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షత సచివాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ భూములపై పెరుగుతున్న ఫిర్యాదుల అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ నేపధ్యంలో గ్రామ సభలు నిర్వహించి, ఆ ప్రాంతంలోని ఈ తరహా భూములపై చర్చించి, తుది నిర్ణయానికి రావాలన్న అభిప్రాయాన్ని మంత్రులు వ్యక్త ంచేశారు. గ్రామ సభలతో పాటే పరిశీలనను కూడా పూర్తి చేయాలని నిర్ణయించారు. మూడు నెలల కాలంలో ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని, అప్పటి వరకు ఈ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించిన రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి రెవెన్యూరికార్డులను తారుమారు చేయడం,ల్యాండ్ గ్రాబింగ్ వంటివి జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంల జిల్లాల్లో పర్యటించి భూముల బదిలీల్లో జరిగిన మోసాలు, దోపిడీలు, కబ్జాలు గుర్తించి వాటిని బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కూడా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం రూ.22.95కోట్ల వ్యయంతో జారీ చేసిన 21.86లక్షల భూ హక్కు సర్వే పత్రాల స్థానంలో ప్రభుత్వముద్ర, క్యూఆర్‌కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేయాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ రికార్డులు, పాస్‌బుక్‌లను తయారు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అక్టోబరు1నుంచి రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి తీసుకురావాలని, ఈ లోగా అవసరమైన ప్రక్రియలనన్నింటిని పూర్తిచేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే నెల ఐదవ తేదిలోగా నూతన విధానాన్ని క్యాబినెట్ ముందుకు తీసుకువచ్చి ఆమోదం పొందాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. దీనికోసం అవసరమైతే క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడం, కన్సల్టెన్సీ సేవలను పొందడం వంటి అంశాలను కూడా మంత్రివర్గం పరిశీలించనుంది. కొత్తగా అమల్లోకి రానున్న నూతన మద్యం విధానంలో రాష్ట్రంలోకి అక్రమ మద్యం రవాణా, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం (ఎన్‌డిపిఎల్) ప్రవేశించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అల్పాదాయ వర్గాలకు అందుబాటులో నాణ్యమైన మద్యాన్ని మిగతా 7లో

యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం

నేడు ప్రమాణ స్వీకారం

- 15 మంది సభ్యుల అడ్వైజరీ కౌన్సిల్



ఢాకా : నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం గురువారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈ మేరకు బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం రాత్రి 8గంటల సమయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం వుండవచ్చని తెలిపారు. దాదాపు 15మంది సభ్యులు అడ్వైజరీ కౌన్సిల్‌లో వుండే అవకాశం వుందని కూడా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యూరప్‌లో వున్న యూనస్ గురువారం మధ్యాహ్నం ఢాకా చేరుకుంటారని ఆయన కార్యాలయం తెలిపింది.

దేశ పునర్నిర్మాణానికి సిద్ధం కండి ప్రజలకు యూనస్ పిలుపు

శాంతియుతంగా వుండాల్సిందిగా దేశ ప్రజలకు యూనస్ విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజలనుద్దేశించి ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రశాంతంగా వుండి, దేశ పునర్నిర్మాణానికి సిద్ధం కండి. మనం హింసా పథాన్ని అనుసరిస్తే, ప్రతీదీ ధ్వంసమవుతుంది." అని ఆయన హెచ్చరించారు. మన తప్పుల కారణంగా విజయం చేజార్చుకోరాదని అన్నారు. రెండవ విజయ దినోత్సవాన్ని సాధించిన సాహసోపేతమైన విద్యార్థులను అభినందిస్తున్నాను. ఆ విద్యార్థులకు అధికారికంగా మద్దతునందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. కొత్తగా సాధించిన ఈ విజయాన్ని తప్పులు చేసి దెబ్బతీసుకోరాదని అన్నారు. హింసకు దూరంగా వుంటూ, శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు.

ఇదిలావుండగా. లేబర్ లాకు సంబంధించిన కేసులో యూనస్‌కు విధించిన శిక్షను బంగ్లాదేశ్ కోర్టు రద్దు చేసిందని యూనస్ తరపు న్యాయవాది చెప్పారు.

భారత్‌కు చేరిన నాన్ ఎసెన్షియల్ సిబ్బంది

మరోవైపు, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం నేపథ్యంలో హై కమిషన్, కాన్సులేట్‌ల్లోని నాన్ ఎసెన్షియల్ సిబ్బందిని, వారి కుటుంబాలను భారత్ వెనక్కి పిలిపించింది. ఢాకాలోని భారత హైకమిషన్ నుంచి 190 మంది సిబ్బంది ఇండియా చేరుకున్నారు. సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులను ప్రత్యేక ఎయిర్ ఇండియా (ఎఐ1128) విమానంలో భారత్‌కు తీసుకువచ్చినట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దాదాపు 30మంది భారత సీనియర్ దౌత్యవేత్తలు బంగ్లాలోనే ఉన్నట్లుగా తెలిపాయి. రాజధాని ఢాకాలో భారత్ హై కమిషన్ ప్రధాన కార్యాలయం వుండగా, చిట్టగాంగ్, రాజ్‌షాహి, ఖుల్నా, సిల్‌హట్‌ల్లో సహాయ హై కమిషన్‌లు లేదా కాన్సులేట్ కార్యాలయాలు వున్నాయి.



అడవిలో అదానీ కుంపటి

- హైడల్ పవర్ ప్రాజెక్టు కోసం సర్వే
- కోనాం ఆయకట్టుకు నీటి సమస్య
- గిరిజన బతుకులకు తీరని నష్టం

3

జగన్ అక్రమాస్తుల కేసు

విచారణ వేగవంతం

సిబిఐ కోర్టుకు సుప్రీం ధర్మాసనం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణ వేగవంతం చేయాలని సిబిఐ కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. వీలైనంత త్వరగా విచారణ పూర్తి కావాలని పేర్కొంది. ఈ మేరకు ఇప్పటికే తగిన ఆదేశాలు ఇచ్చామని జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం గుర్తుచేసింది. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎంపి రఘురామ కృష్ణరాజు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను నవంబరుకు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై ధర్మాసనం ఉదయం, మధ్యాహ్నం భోజనం విరామ అనంతరం విచారణ జరిపింది. సిబిఐ దాఖలు చేసిన అఫిడవిట్ లోని అంశాలు షాకింగ్‌గా అనిపిస్తున్నాయని జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. కేసులు ట్రయల్ ప్రారంభం కాకుండా... ఇన్ని కేసులు ఎలా ఫైల్ చేశారని ప్రశ్నించారు. ఆరుగురు జడ్జిలు మారిపోయారని, రిటైర్డు అయ్యారని రఘురామ తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జస్టిస్ ఖన్నా కోర్టులో వచ్చిన ఆదేశాలు తప్పు అని, ఇంకో కోర్టులో ఇచ్చిన ఉత్తర్వులు తప్పు అంటూ కాలయాపన చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కోర్టుల ఉత్తర్వులు తప్పు అంటూ చేస్తున్న వ్యవహారానికి ట్రయల్‌కు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని, సాధారణ కార్యకలాపాలకు ఇది అడ్డంకిగా మారుతోందని రఘురామ కృష్ణరాజు తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టులో తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని, ఎలాంటి అడ్డంకి తమకు రావడం లేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఇలాంటి కేసుల విచారణలో ఇప్పటికే సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ట్రయల్ జరుగుతుందన్నారు. ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నందున వాటిని అనుసరించాల్సిందేనన్నారు. 'ట్రయల్ కోర్టులు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఏంటో తెలుసుకుంటాయి. సిబిఐకి కూడా అవే నిబంధనలు వర్తిస్తాయని ఇప్పటికే చెప్పాం' అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

రాష్ట్ర రహదారులపై

టోల్ ఛార్జీలు వద్దు : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు కూడా టోల్ ఛార్జీలు వసూలు చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిపిపి పేరుతో రోడ్లపై టోల్ ట్యాక్స్ వసూలుకు సన్నాహాలు చేయాలని కలెక్టర్ల సమావేశంలో అధికారులకు సిఎం ఆదేశించినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణం వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ వసూలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ సమావేశంలో నిర్ణయించినా భవిష్యత్తులో మొత్తం 12,650 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులపై టోల్ ఛార్జీలు వసూలు చేసే ప్రమాదముందని అన్నారు. రోడ్లను అభివృద్ధి చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. 'వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో లైఫ్ ట్యాక్స్, రోడ్ ట్యాక్స్, డీజిల్, పెట్రోల్‌పై సెస్‌ల పేరుతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. ఆ సొమ్ము ఆయా వాహనాల యజమానులు, వాటిలో ప్రయాణించే వారు ఇప్పటికే భరిస్తున్నారు' అని తెలిపారు. కొత్తగా టోల్ ట్యాక్స్ వసూలుకు పూనుకోవడం తగదన్నారు. ఇప్పటికే జాతీయ రహదారులన్నింటిలో టోల్ ట్యాక్సుల భారంతో రవాణా రంగం నష్టాల్లో వుందని, పిపిపిల పేరుతో రాష్ట్ర రహదారుల్లో కూడా ప్రతిపాద టోల్ ట్యాక్సులు మోయలేని భారాలుగా మారి రాష్ట్ర రవాణా రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలపై అదనపు భారం పడకుండా రాష్ట్ర రహదారులపై టోల్ ట్యాక్స్ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు.

ఫొగాట్ కృషి గర్వకారణం

రెజ్లింగ్‌లో ఫైనల్‌కు చేరి దేశానికి పతకం సాధించడం కోసం వినేష్ ఫొగాట్ చేసిన కృషి గర్వకారణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. అధిక బరువు వల్ల అనర్హతకు గురవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వ కక్ష సాధింపులను ఎదుర్కొని దేశం కోసం ధీరోధాత్తంగా పోరాడారని పేర్కొన్నారు.



వయనాడ్ బాధితులకు ప్రభాస్ రూ.2 కోట్లు సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


వయనాడ్ విపత్తు బాధితులకు అండగా చిత్ర పరిశ్రమలోని పలువురు నటీనటులు ముందుకొస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ నుంచి ఇప్పటికే సెలబ్రిటీలెందరో సాయం ప్రకటించారు. తాజాగా ప్రభాస్ వయనాడ్ విపత్తు సహాయార్థం రూ. 2 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రకటించిన ఈ సాయంతో ప్రభాస్ పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సాయంపై అభిమానులు, నెటిజన్లు మాత్రమే కాకుండా.. ప్రభాస్‌ది చాలా గొప్ప మనసు అంటూ అందరూ ప్రశంసలు కురిపిస్తుండటం గమనార్హం.

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి

- 70 గేట్ల ఎత్తివేత
- పరీవాహక ప్రాంత ప్రజలకు హెచ్చరికలు

ప్రజాశక్తి - విజయవాడ

శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల గేట్లు ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో 50 గేట్లను మూడు అడుగులు, 20 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,37,450 క్యూసెక్కులు, 13,477 క్యూసెక్కులను కాల్వలకు అధికారులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల మేర నీటి మట్టం కొనసాగుతుంది. ఇన్‌ఫ్లో 1,50,927 క్యూసెక్కులుగా ఉంది. వరద నీటిని దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో కృష్ణానదీ పరీవాహక ప్రాంత ప్రజలు, లంకగ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పంట్లు, నాటుపడవలతో నదిలో ప్రయాణించవద్దని, వరద నీటిలో ఈతకు, స్నానాలకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయొద్దని సూచించారు. పశువులు, గొర్రెలు, మేకలు వంటి జంతువులను ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతలకు తరలించాలని హెచ్చరించారు.



కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తున్న సిఎం చంద్రబాబు

కృష్ణమ్మ పరవళ్లను పరిశీలించిన సిఎం చంద్రబాబు

చేనేత దినోత్సవంలో పాల్గొని ఉండవల్లిలోని స్వగృహానికి వెళుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన కాన్వాయ్‌ను ఆపి కొద్దిసేపు ప్రకాశం బ్యారేజీని పరిశీలించారు. కృష్ణమ్మ పరవళ్లను ఆసక్తిగా తిలకించారు. వరద ప్రవాహాన్ని చూసేందుకు బ్యారేజీ వద్దకు వచ్చిన సందర్శకులతో కాసేపు ముచ్చటించారు.

ఎన్‌టిఆర్ పేరుతోనే అన్న క్యాంటీన్లు

- పవన్ కల్యాణ్ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆగస్టు 15 నుంచి ప్రారంభించే అన్న క్యాంటీన్లకు ఏ పేరు అయితే బాగుంటుందనే చర్చ క్యాబినెట్‌లో జరిగినట్లు తెలిసింది.ఆ క్యాంటిన్లను ఎన్‌టిఆర్ పేరుతో కొనసాగించాలా? లేక డొక్కా సీతమ్మ పేరు కూడా జోడించాలా అనే చర్చ నడిచినట్లు సమాచారం. 2019 వరకు ఉన్న విధంగా అన్న క్యాంటీన్లు ఎన్‌టిఆర్ పేరుతోనే కొనసాగించాలని, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు కొనసాగిస్తే బాగుంటుందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సూచించినట్లు తెలిసింది. మధ్యాహ్న భోజన పథకానికి సీతమ్మ పేరు పెట్టడం వల్ల ప్రతి విద్యార్థికి ఆమె గొప్పతనం తెలుస్తుందని, పాఠశాల స్థాయిలో విశిష్ట వ్యక్తులు,దాతృత్వం కలిగిన వారి పేర్లు మీద పథకాలు ఉండటం వల్ల భావితరాలకు మేలు జరుగుతుందని పవన్‌కల్యాణ్ మంత్రి వర్గ సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

భ్రమలు వీడి వాస్తవంలోకి రండి

- జగన్‌నుద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంకా మీరే ముఖ్యమంత్రి అనే భ్రమలు నుంచి మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయటకు రావాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని పెట్టకూడదనడానికి అసలు మీరెవరు? మీకు ఆ అధికారం ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విలువల గురించి మాట్లాడే ముందు గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని లూఠీ చేసిన విధానం, అక్రమాస్తుల కేసులో సిబిఐ వేసిన 11 చార్జిషీట్లు గురించి ప్రజలకు చెప్పే దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు.

అవయవదానంతో ముగ్గిరికి ప్రాణదానం

- ఇఎస్ఐసి ఆస్పత్రిలో తొలిసారి అవయవమార్పిడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబం ఇతరుల ప్రాణాలను నిలబెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఇఎస్ఐసి ఆస్పత్రిలో 45 సంవత్సరాల వ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ పరిస్థితిలో ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ శ్యాంసోన్ బృందం ఆ వ్యక్తి కుటుంబానికి అవయవదానంలోని ఉన్నత లక్ష్యాలను వివరించారు. దీంతో ఆ కుటుంబం బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆ వ్యక్తి నుంచి సేకరించిన ఒక మూత్రపిండాన్ని 50 సంవత్సరాల మహిళా రోగి అమర్చారు. ఆమె గత నాలుగేండ్ల నుంచి డయాలసిస్‌పై జీవితాన్ని కొనసాగిస్తున్నది. కాగా ఈఎస్ఐసీ ఆస్పత్రిలో తొలిసారిగా అవయవమార్పిడి శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా ముగించినట్టు వైద్యులు తెలిపారు. మరో మూత్రపిండంతో పాటు కాలేయాన్ని ఉస్మానియా ఆస్పత్రికి ఇవ్వగా వాటితో మరో ఇద్దరికి ప్రాణదానం చేశారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్సను డాక్టర్ మధు, డాక్టర్ సందీప్‌తో పాటు చీఫ్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్లు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పాండురంగారావు, అనస్తీషియా హెడ్ డాక్టర్ నాగార్జున, నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ ధనలక్ష్మి తమ బృందాలతో కలిసి పూర్తి చేశారు.

ప్రైవేటుకు ఎయిర్‌పోర్టులు!

- విజయవాడ, రాజమండ్రి, తిరుపతి విమానాశ్రయాల అప్పగింత?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత కీలకమైన ఎయిర్‌పోర్టులను ప్రైవేటు పరం చేసేందుకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి త్వరలో ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రవేశపెట్టిన మానిటైజేషన్ పైపులైనులో భాగంగా రాష్ట్రంలో విజయవాడ, తిరుపతి, రాజమండ్రి విమానాశ్రాయలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేచనున్నారని సమాచారం.

. ప్రస్తుతం విజయవాడ, తిరుపతి ఎయిర్‌పోర్టుకు రద్దీ పెరిగింది. తిరుపతి ఎయిర్‌పోర్టు 2021 వరకూ కొంత నష్టాల్లో ఉన్నా ప్రస్తుతం అదాయం పెరుగుతూ రాష్ట్రానికి సేవలందిస్తున్న సమయంలో దీన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి సంబంధించి ప్రక్రియ పూర్తయిందని, విధివిధానాలు త్వరలో వెల్లడిస్తామని కేంద్ర మంత్రులు చేసిన ప్రకటన చర్చనీయాంశం అవుతోంది. 2023లో కేంద్రం తన పరిధిలో ఆస్తులను అమ్మి నిధులు



సమకూర్చుకునే పనిలో భాగంగా మానిటైజేషన్ ప్రతిపాదన తీసుకొచ్చింది. అందులో రాష్ట్రంలో ఎయిర్‌పోర్టులను ప్రధానంగా ప్రస్తావించారు. రైల్వే, ఓడరేవులు ఉన్నప్పటికీ అవన్నీ అందుబాటులోకి వచ్చి అమ్మకాలు జరిపేందుకు సమయం పడుతుంది. ఎయిర్‌పోర్టుల కోసం అదానీ టెండరు వేసినట్లు వార్తలూ వచ్చాయి. చట్టపరమైన ప్రక్రియలు పూర్తిచేసి ఆయనకే కట్టబెట్టే అవకాశం ఉందని అంటున్నారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నప్పటికీ కేంద్రం వెనుకడుగు వేయడం లేదు. ఒకవైపు నిర్వహణలో ఉన్న ఎయిర్‌పోర్టులు అమ్మకాలు పెడుతుంటే మరోవైపు కొత్త వాటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. మూడు ఎయిర్‌పోర్టులు, ఎయిర్‌స్ట్రిప్‌లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించిన రోజే మానిటైజేషన్‌కు సంబంధించిన అంశం ఢిల్లీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఎయిర్ పోర్టులు ఎలా అప్పగిస్తారు, ఎన్నేళ్లకు వీటిని కేటాయింపులు చేస్తారు అనే అంశాలపై ఈ వారంలో విధి విధినాలు త్వరలో ఖరారవుతాయని సమాచారం. గతంలో విజయవాడ ఎయిర్‌పోర్టు నుండి సింగపూర్‌కు విమానాలు నడిపిన సంగతి తెలిసిందే. విమాన సంస్థలకు నష్టం వస్తే, దానిని ప్రభుత్వమే భరించేలా అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. తాజాగా ఆ తరహా ఒప్పందాలకు కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర నిర్ణయం వెలువడింది. ఇదే అంశంపై గతంలో ఎంపి గల్లా జయదేవ్ పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు అలాంటి చర్చ లేదని సమాధానం ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆలోచిస్తున్నట్లు తెలపడం విశేషం. గత మూడేళ్లుగా దీనిపై కార్యాచరణ జరుగుతున్నప్పటికీ ఈ ఏడాది దీనికి సంబంధించి ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉందని అంటున్నారు.

చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దుకు కృషి

- కార్మికుల గృహాలకు సౌరవిద్యుత్ సదుపాయం
- నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించండి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడ మేరీస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు మాట్లాడుతూ... చేనేత కార్మికుల గృహాలకు సౌరవిద్యుత్ సదుపాయం కల్పిస్తామని, నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దామని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం చేనేతలకు ఇచ్చే ప్రోత్సాహకాలన్నీ రద్దు చేసిందన్నారు. 'చేనేత కార్మికులకు నైపుణ్యం పెంచి ఆధునిక శిక్షణ ఇప్పిస్తాం. వారికి ఆరోగ్యబీమా కల్పిస్తాం. నేతన్నలు సామూహికంగా పనిచేసే విధానానికి శ్రీకారం చుడతాం. చేనేత పరిశ్రమను కాపాడటం మన బాధ్యత. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తాం.పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చేనేతలో సహజ రంగులను ప్రోత్సహిస్తాం' అని అన్నారు. ఐదేళ్ల పాలనలో ఏ శాఖలో చూసినా విధ్వంసమే కనిపిస్తోందన్నారు. ఫొటోలకు రూ.వందల కోట్లు ఖర్చుచేసిన గత ప్రభుత్వం...చేనేతల సంక్షేమంపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఆగస్టు 15 నుండి మళ్లీ అన్న క్యాంటీన్లను పున:ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు జలకళతో కళకళలాడడం హర్షణీయమన్నారు. ఎగ్జిబిషన్‌లో తన సతీమణి భువనేశ్వరికి రెండు చీరలను చంద్రబాబు కొనుగోలు చేశారు. ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్‌రావు, సుజనా చౌదరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాలలో చేనేతలతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారని ముందుగా ప్రకటించినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.



విజయవాడలో జరిగిన చేనేత దినోత్సవంలో చీరలు కొనుగోలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏజెన్సీలో భారీ వర్షం

- కొండవాగులు ఉధృతం

ప్రజాశక్తి - పశ్చిమగోదావరి యంత్రాంగం

ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన భారీ వర్షాలకు కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం కాజ్‌వే, ఇప్పలపాడు కాజ్‌వే, అల్లి కాలువ కోట రామచంద్రపురం కాజ్‌వేలపై నుంచి నీరు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. గత నెలలో భారీ వర్షాలకు కొండవాగులు పొంగడంతో గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లే రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దీంతో ఆలయ దర్శనాన్ని కొన్ని రోజులు నిలిపివేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఆలయ దర్శనాన్ని ప్రారంభించారు. మళ్లీ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆలయం పైనుంచి కొండ వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. జీలుగుమిల్లి మండలంలో కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగు, సంగం వాగు, పాలచర్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కాజ్‌వేల వద్ద ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసులు పహరా కాస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం బుధవారం నాటికి స్వల్పంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,00,331 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 30.670 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.770 మీటర్ల నీటి మట్టం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా రాష్ట్రం

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా గ్లోబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో ఎడ్యుకేషన్ విభాగం పనితీరు, ర్యాంకింగ్ మెరుగుదల, ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంటు సిస్టమ్ ఏర్పాటు అంశాలపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఎఐ వర్సిటీని రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఎకోసిస్టమ్, ఇతర అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఐ వర్సిటీ ద్వారా ఎడ్యుకేషన్, హెల్త్ కేర్, గవర్నెన్స్ తదితర రంగాల్లో సమర్థవంతమైన సేవలు అందించే ఆస్కారం ఏర్పడుతుందన్నారు. అధునాతన ఎఐ టెక్నాలజీ ద్వారా కెజి నుంచి పిజి



వరకు విద్యార్థులకు స్టూడెంట్ పాస్‌పోర్టు ఇచ్చేలా ఫ్రేమ్‌వర్క్ రూపొందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్య కార్యదర్శి సౌరబ్‌గౌర్, హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహన్‌రావు, కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనరు పోలా భాస్కర్, స్కిల్ డెవలప్‌మెంట్ విసి అండ్ ఎమ్‌డి గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం ఆదాయం కోసం ప్రజలను అనారోగ్యం పాలు చేసేలా మద్యం దుకాణాల్లో నాసిరకం బ్రాండ్‌లను ప్రవేశపెట్టిందని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమన్న రీతిలో అక్టోబరు ఒకటి నుంచి అమలు చేయనున్న కొత్త మద్యం పాలసీలో నాణ్యమైన పాత బ్రాండ్‌లు అన్నింటినీ ప్రవేశపెడతామని అన్నారు. రాష్ట్ర సచివాలయంలో మద్యం కంపెనీలతో మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు హరిస్తున్న కల్తీ మద్యం బ్రాండ్ల నుంచి విముక్తి కలిగించేలా త్వరలోనే మెరుగైన పాలసీ తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని కేవలం ప్రైవేటు వ్యాపారంగా మాత్రమే భావించిందన్నారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత నాటి పాలకులు మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని ప్రజల ప్రాణాలు హరించిందన్నారు. మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చే పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని విమర్శించారు. దేశమంతా డిజిటల్ పేమెంట్ల వైపు వెళ్తుంటే రాష్ట్రంలో మాత్రం క్యాష్ అండ్ క్యారీ విధానాన్ని అమలు చేశారని తెలిపారు. మద్యం అమ్మకాలతో రూ.వేల కోట్ల లూటీ చేశారని ఆరోపించారు.

ఎగువ కాపర్ డ్యామ్‌కు తలనొప్పిగా సీపేజ్

- దయాఫ్రం వద్ద పెరుగుతున్న నీటి మట్టం
- ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందన్న అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టులోని ఎగువ కాపర్ డ్యామ్ సీపేజీ (ఊట) పెరుగుతోంది. సాధారణంగా వరదలు వచ్చిన సమయంలో స్వల్పంగా సీపేజీ ఉంటుంది. దీనివల్ల పెద్దగా ఇబ్బందేమీ ఉండదు. కాని కాపర్ డ్యామ్ నిర్మించి కాలం పెరిగిపోవడంతో పటిష్టత తగ్గుతూ వస్తోంది. దీంతో సీపేజీ పెరుగుతోంది. ప్రస్తుతం డయాఫ్రం వాల్ ఉన్నచోట 22 మీటర్ల ఎత్తులో నీరు నిలిచి ఉంది. సోమ, మంగళవారం 23 నుండి 24 మీటర్ల ఎత్తులో నీరు నిలిచి ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం గోదావరి స్వల్పంగా తగ్గడంతో సీపేజీ ద్వారా వచ్చిన నీరు కూడా తగ్గుతోంది. అయితే తెలంగాణ పరిధిలో పెద్దయెత్తున వర్షాలు పడటంతో మరలా వరద నీరు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దీంతో మరలా నీరు పెరిగి అలాగే నిల్వ ఉంటే కాపర్ డ్యామ్‌లో బలహీనపడుతుందని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పనిగా నీరు వస్తుంటే కొత్తగా నిర్మించాలని ప్రతిపాదించిన డయాఫ్రం వాల్ నిర్మాణం మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీకి నిపుణులు సూచించారు. దీని ప్రకారం నాలుగు సీజన్లు పడుతుందని ఇటీవల సిఎం చంద్రబాబు కూడా తెలిపారు. అదీ ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎటువంటి ఇబ్బందీ లేకపోతే. ప్రస్తుతం నీటి ఒత్తిడి, సీపేజీ పెరుగుతోంది. గతంలో నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోసేవారు. డ్యామ్ నుండి వచ్చే నీటి సామర్థ్యం పెరగడంతో వాటిని ఎత్తిపోయడం అంత తేలికయ్యే పనికాదు. దీనిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. అక్టోబరు వరకూ తమకు టెన్షన్ తప్పదని, ఇంత సీపేజీ గతంలో లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ కాపర్ డ్యామ్‌కు ఏదైనా ఇబ్బంది ఏర్పడితే డయాఫ్రం వాల్ నిర్మాణం ఆలస్యం జరిగి ఎర్త్ కం రాక్ ఫిల్ (ఇసిఆర్ఎఫ్) ఆలస్యం అవుతుందని, ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చేందుకు మరో ఐదేళ్లు పడుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

సీపేజీ పెరిగితే సమస్య

ప్రస్తుతం ఎగువ కాపర్ డ్యామ్ వద్ద ఉన్న నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, గోదావరి తగ్గిన నేపథ్యంలో ఒత్తిడి తగ్గుతోందని, పెరిగితే మరలా నీటి సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు. సీపేజీపై అధికారులను వివరణ కోరగా.. ప్రస్తుతం ఇబ్బందేమీ లేదని, ఇదే పద్ధతి కొనసాగితే ఎగువ కాపర్ డ్యామ్‌కు సమస్య ఉత్పన్నమవుతుందని, ఫలితంగా డయాఫ్రం వాల్ నిర్మాణం జాప్యం అవుతుందని వివరించారు. ఎగువ కాపర్ డ్యామ్ నిర్మాణానికి అదొక అదనపు ఖర్చవుతుందని తెలిపారు.

స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరి దారుణం : వైఎస్‌ఆర్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని నేటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకోకపోవడం దారుణమని వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు వై.మస్తానప్ప అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1273వ రోజుకు చేరాయి. దీక్షల్లో వైఎస్‌ఆర్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యంగా పోరాడి విశాఖ ఉక్కును కాపాడుకుని తీరుతారన్నారు. రాష్ట్ర, విశాఖ అభివృద్ధిలో ఉక్కు కర్మాగారం విశేష పాత్ర పోషించిందని తెలిపారు. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

41ఏ నోటీసు ఇచ్చాక మళ్లీ ఎలా అరెస్టు చేస్తారు?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సిఆర్‌పిసి 41ఏ నోటీసు ఇచ్చాక తిరిగి ఆ వ్యక్తిని ఎలా అరెస్టు చేస్తారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. 41ఏ ఇచ్చిన తరువాత మళ్లీ దానిని నుంచి వెనక్కి వెళ్లి అరెస్ట్ చేస్తామంటే జనం ఎక్కడికి వెళ్లాలని నిలదీసింది. జోగి రమేష్ వ్యాజ్యంపై విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన ఇంటి వద్ద జరిగిన గొడవలకు సంబంధించిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జోగి రమేష్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



వివేక హత్య కేసులో సహకరించండి

- హోంమంత్రికి నర్రెడ్డి సునీత విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వివేకానందరెడ్డి కూతురు నర్రెడ్డి సునీత రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనితను కలిశారు. బుదవారం రాష్ట్ర సచివాలయంలోని హోమ్ మంత్రి చాంబర్‌కు వెళ్లి మంత్రి అనితతో భేటీ అయ్యారు. తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయాన్ని సునీత మంత్రికి వివరించారు. వివేకా హత్య తదనంతర పరిణామాలను హోమ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక పోలీసులు హంతకులకు అండగా నిలిచారని వివరించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సమయంలో కేసును నీరుగార్చేలా వ్యవహరించిన వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిబిఐ అధికారులపై తప్పుడు కేసులు పెట్టడంతోపాటు సాక్షులను బెదిరించారని వివరించారు. ఈ కేసులో తాను చేస్తున్న న్యాయపోరాటానికి సహకరించాలని కోరారు. ఈ కేసు విచారణ సిబిఐ విచారణలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా సునీతకు హోమ్ మంత్రి అనిత హామీ ఇచ్చారు. దోషులకు శిక్ష పడేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఈ కేసులో తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టేది లేదని అన్నారు.

ఇ-క్రాప్‌లో వాస్తవ సాగుదారులు మాత్రమే నమోదు

- వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూముల వాస్తవ సాగుదారులతో మాత్రమే ఇ-క్రాప్‌ను నమోదు చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఆదేశించారు. బుధవారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని వ్యవసాయశాఖలకు సంబంధించిన అధికారులకు ఇ-క్రాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇ-క్రాప్‌లో సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేసుకోవటం ద్వారా వారికి ప్రభుత్వం అందించే అన్ని వ్యవసాయ పథకాలకూ అర్హులు అవుతారని తెలిపారు. పంటల బీమా, వడ్డీలేని పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల అమ్మకాలు ఇలా అన్ని అంశాలకూ ఇ-క్రాప్ ప్రామాణికమని తెలిపారు. కౌలు కార్డులు పొందలేక సాగుచేస్తున్న వారిని క్షేత్ర స్థాయిలో నిజ నిర్ధారణ చేసుకుని వారిని వాస్తవ సాగుదారుగా పరిగణించి నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతల సమావేశం సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్

జగన్‌కు ప్రత్యామ్నాయంగా బుల్లెట్ ప్రూఫ్ కారు

- హైకోర్టుకు హామీ ఇచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యామ్నాయంగా బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఇప్పుడు ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి మరమ్మతులు చేయించి తిరిగి ఇస్తామని తెలిపింది. ఈ లోపు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఆయనకు కేటాయిస్తామని తెలియజేసింది. ఈ మేరకు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు బుధవారం హామీ ఇచ్చారు.

తనకు గతంలోని భద్రతను కుదించారని, సరిగ్గా పనిచేయని బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇచ్చారంటూ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బివి లక్ష్మీనసింహ చక్రవర్తి విచారణ జరిపారు. రెండు వారాల్లోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర హోంశాఖను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఆ కౌంటర్లకు రిప్లై కౌంటర్ దాఖలుకు జగన్‌కు వారం రోజులు గడువు ఇచ్చారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

జగన్, గత మంత్రులపై కేసు నమోదు కోసం పిటిషన్

రిషికొండపై నిర్మాణాల వ్యవహారంలో మాజీ సిఎం వైఎస్ జగన్, ఆయన మంత్రివర్గ సభ్యులు, గత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఇతరులపై నేరపూరిత విశ్వాసఘాత కేసు నమోదు చేయాలన్న ఫిర్యాదుపై పోలీసులు స్పందించడం లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళగిరి పోలీసులను తన ఫిర్యాదు నమోదు చేసేలా ఆదేశించాలని కోరుతూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షులు టి గంగాధర్ పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ బివిఎల్ చక్రవర్తి విచారణ జరిపారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

సిలికా ఇసుక అధిక తవ్వకాలపై ఏమి చర్యలు తీసుకున్నారు?

లీజు పొందిన భూమి కంటే ఎక్కువగా సిలికా ఇసుక తవ్వకాలు చేసిన వారిపై ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని గనులశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్) ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. విచారణను సెప్టెంబరు నాలుగుకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. నెల్లూరు జిల్లా, చిల్లకూరు మండలం, బల్లవోలు, మోమిడి, వెళ్లపాలెం గ్రామాల పరిధిలోని పలు సర్వే నెంబర్లలోని ప్రైవేటు, ప్రభుత్వ భూముల్లో లీజుకు తీసుకున్న విస్తీర్ణానికి మించి సిలికా తవ్వకాలు జరిపారంటూ గూడూరుకు చెందిన నాను మునీంద్ర రెడ్డి ఇతరులు వేసిన పిల్‌ను హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

జగన్ భద్రతపై దుష్ప్రచారం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యక్తిగత భద్రత కల్పించకుండా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ భద్రతపై కూటమి నేతలు విచిత్రమైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజాదరణ కలిగిన మాజీ ముఖ్యమంత్రికి ఎస్ఆర్‌సి రిపోర్టు రాకుండానే సెక్యూరిటీని తొలగించిందన్నారు. జగన్ ఓడిపోయారు.. కానీ చనిపోలేదని స్వయంగా స్పీకరుగా వున్న అయ్యన్నపాత్రుడు అన్నారంటే కూటమి ఎలాంటి వైఖరితో వుందో అవగతమవుతుందన్నారు. అందుకే కోర్టుకు వెళ్లామన్నారు. కోర్టులో ప్రభుత్వం చెబుతున్న వాదనకు, బయట మంత్రులు నారా లోకేష్, చెబుతున్న మాటలకు పొంతన వుండటం లేదని విమర్శించారు. సిఎంగా వున్నప్పుడు జగన్ భద్రత కోసం 139 మంది పోలీసులుంటే 986 మంది వున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. మాజీ సిఎంను పులివెందుల ఎమ్మెల్యే అనడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. చంద్రబాబుకు 2003లో ప్రమాదం జరిగితే ప్రతిపక్షంలో వున్నా ఏమాత్రం భద్రతను కుదించలేదని అన్నారు. లోకేష్ కుమారుడు దేవాన్ష్‌కు ఆరుగురు సెక్యూరిటీని ఇచ్చిన ప్రభుత్వం.. మాజీ ముఖ్యమంత్రికి ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ ఎన్నికతో చంద్రబాబుకు గుణపాఠం

- మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి జరగనున్న ఎన్నికలు సిఎం చంద్రబాబుకు గుణపాఠం చెప్పేలా వైసిపి అభ్యర్థి బొత్స సత్యనారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో విశాఖ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ పరిధిలోని అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రజా ప్రతినిధులతో జగన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపికి తిరుగులేని మెజారిటీ వుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిడిపికి తగిన సంఖ్యా బలం లేకున్నా అనైతికంగా గెలిచేందుకు పోటీకి దిగుతోందన్నారు. మొత్తం ఓట్లలో వైసిపి మెజారిటీనే 380 ఓట్లకు పైగా వుందని, అయినా పోటీకి పెడుతున్నారని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు తన నైజాన్ని చూపిస్తున్నారని అన్నారు. అధర్మంగా డబ్బుతో ప్రలోభ పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో 10 శాతం మంది ప్రజలు చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మారని, అందుకే తమకు ఓటమి ఎదురైందని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఇప్పటికీ ఒక్కటి కూడా అమలు చేయలేదని, ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో శాసనమండలి విపక్ష నాయకులు లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు

బాలికపై అత్యాచార కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడిలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్పి కె.ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లా రెట్టచింతల మండలం కుమ్మరికోట గ్రామానికి చెందిన మిర్యాల జయరావు లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఓ పని నిమిత్తం నూజివీడుకు వచ్చి ఆదివారం రాత్రి చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నిందితుడు 2019లో రెంటచింతల ప్రాంతంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో అరెస్టయ్యి జైలుకెళ్లాడని, ప్రస్తుతం బెయిల్‌పై బయట తిరుగుతున్నాడు. ఘటన జరిగిన రోజు నిందితుడి కోసం నూజివీడు డిఎస్‌పితోపాటు మరో నలుగురు సిఐల నేతృత్వంలో నాలుగు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడు ఓ వాహనంలో ప్రయాణిస్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పి చెప్పారు.

తిరుమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘాట్‌రోడ్డు చివరి మలుపు వద్ద బైక్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు క్రింద మృతదేహాలు ఇరుక్కుపోయాయి. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిని తమిళనాడు వాసులుగా గుర్తించారు. ఘోర ప్రమాదం కారణంగా ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి తల్లిదండ్రులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

అడవిలో అదానీ కుంపటి

- హైడల్ పవర్ ప్రాజెక్టు కోసం సర్వే
- కోనాం ఆయకట్టుకు నీటి సమస్య
- గిరిజన బతుకులకు తీరని నష్టం



సర్వే నిలిపివేయాలని గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అడవిని, మైదాన ప్రాంత ఆయకట్టును నాశనం చేసే హైడల్ పవర్ ప్రాజెక్టు తమకొద్దని ఆదివాసీలు, రైతులు అభ్యంతరాలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. అదానీకి చెందిన హైడల్ పవర్ ప్రాజెక్టు కోసం అటవీశాఖ సిబ్బంది సహాయంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో చకచకా సర్వే నిర్వహిస్తున్నారు. స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా వినిపించుకోకుండా తమ పని తాము చేసుకుపోతున్నారు.

హైడల్ పవర్ ప్రాజెక్టు వస్తే ఉమ్మడి విశాఖ జిల్లాలోని దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీలో సగం గ్రామాలు, ఏజెన్సీలోని అనంతగిరి మండలంలోని సరియా, మాడ్రేబు, మాకనాబిల్లి, దాయిర్తి గ్రామాలతోపాటు చీడికాడ మండలం కోనాం ఆయకట్టు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అనంతగిరి ప్రాంతం నుంచి వచ్చే నీటి ప్రవాహ ప్రాంతాలను హైడల్ పవర్ ప్రాజెక్టు కోసం అదానీకి అప్పగిస్తే, ఆ ప్రవాహాల ఆధారంగా నిర్మించిన కోనాం జలాశయం ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. వాస్తవానికి కోనాం జలాశయం కింద చీడికాడ, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల్లో సుమారు 12,638 ఎకరాల ఆయకట్టు వుంది. అనంతగిరి మండలంలోని పలు కొండ ప్రవాహాల నుంచి బొడ్డేరు నదిపై నిర్మించిన కోనాం జలాశయానికి నీరు చేరుతోంది. ఆ జలాశయానికి వచ్చే నీటి ప్రవాహాలపైన హైడల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుచేస్తే దాని కిందనున్న కోనాం ఆయకట్టుకు నీరు రాక ఇబ్బంది ఏర్పడుతుంది. మైదాన ప్రాంత ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య ఏర్పడగా, గిరిజన ప్రాంతంలోని దట్టమైన అడవీ ప్రాంతం దెబ్బతింటుంది. ఆ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జీవితాలకు ప్రమాదం ఏర్పడనుంది. ఎంతో పురాతనమైన, విలువైన చెట్లు, వన్య ప్రాణులు అంతరించిపోనున్నాయి. వైసిపి ప్రభుత్వ కాలంలో ప్రారంభమైన సర్వే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. పర్యావరణానికి పెద్ద పీట వేస్తామన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... హైడల్ పవర్ ప్రాజెక్టు కోసం అదానీ కంపెనీ ప్రతినిధులు చేయిస్తున్న సర్వేను నిలుపదల చేయకపోవడం పలు అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది. కొంతమంది గిరిజనులను ప్రలోభపెట్టి సర్వేకు ఆటంకంలేకుండా చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో చింతలపూడి పంచాయతీ కూడియా, రేగులపాలెం ప్రాంతంలో పవర్ ప్లాంట్ కోసం చేపట్టిన సర్వేను గిరిజనులు అడ్డుకున్నారు. కొంతకాలంగా సరియా జలపాతాలున్న దట్టమైన అటవీ ప్రాంతంలో రహస్య సర్వే చేయడంపై నిరసన వ్యక్తమవుతోంది.

సర్వే నిలిపివేయాలని ఆందోళన

రహస్య సర్వే జరుగుతున్న సరియా ప్రాంతాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర, కె.రాముడు, రామకృష్ణ, రవికుమార్‌లు స్థానిక గిరిజనులతో కలిసి బుధవారం సందర్శించారు. సర్వే నిలిపివేయాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సర్వే జరిగిన ప్రాంతంలో పీసా చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహించాల్సివుందన్నారు. అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టాలను ఉల్లంఘించి సర్వే నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదుచేసి, సర్వే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాజధానిలో జంగిల్ క్లియరెన్స్

- పనులు ప్రారంభించిన మంత్రి నారాయణ

ప్రజాశక్తి -తుళ్లూరు (గుంటూరు జిల్లా)



ప్రొక్లైనర్ పై మంత్రి నారాయణ

రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు బుధవారం మొదలయ్యాయి. జంగిల్ క్లియరెన్స్ పనులను వెలగపూడిలో పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పి నారాయణ భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నెల రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేస్తామన్నారు. రూ36.5 కోట్లతో మొత్తం 58 వేల ఎకరాల్లో సుమారు 23,429 ఎకరాలలో కంప చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అమరావతి అడవిలా మారిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో రాజధానిలో రోడ్లు తవ్వేశారని, రోడ్లు, భవన నిర్మాణ మెటీరియల్ దొంగల పాలైందని అన్నారు. ఐఐటి నిపుణుల నివేదిక వచ్చాక బిల్డింగులు, ఇతర నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ద్వేషంతో అమరావతి రాజధానిని నాశనం చేశారని, దీంతో రాజధాని చిట్టడవిలా మారిందన్నారు. రూ.36.5 కోట్లతో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సిసి) సంస్థ జంగిల్ క్లియరెన్స్ పనులకు సంబంధించిన టెండర్లు దక్కించుకుంది. 23,429 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. కార్యక్రమంలో సిఆర్‌డిఎ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-వేంపల్లె (వైఎస్‌ఆర్ జిల్లా)



జమీషా ఖురేషీ (ఫైల్)

ఒంగోలు ట్రిపుల్ ఐటికి చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం రాత్రి క్యాంపస్‌లోని బాత్రూంలో తన చున్నీతో ఉరివేసుకుని విద్యార్థిని మృతి చెందారు. వైఎస్‌ఆర్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ప్రాంగణంలోనే ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్ ఉంది. పోలీసుల వివరాల మేరకు..ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన సయ్యద్ మగ్బుల్ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె జమీషా ఖురేషీ(17) ఒంగోలు ట్రిపుల్ ఐటిలో ఇంటర్ సెకండ్ ఇయర్ (పి-2) చదువుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఫైనల్ ఇయర్‌కు చెందిన ఓ విద్యార్థిని మొబైల్ ఫోన్ క్యాంటీన్ వద్ద పోయింది. ఆ మొబైల్ ఫోన్‌ను జమీషా ఖురేషి తీసుకున్న విషయాన్ని గుర్తించిన ట్రిపుల్‌ఐటి అధికారులు విద్యార్థిని మందలించడంతో పాటు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. మనస్తాపం చెందిన విద్యార్థిని క్యాంపస్ బాత్రూంలో తన చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన తోటి విద్యార్థులు సిబ్బందికి సమాచారమిచ్చారు. ఇడుపులపాయలోని ఆస్పత్రికి అక్కడి ఉంచి వేంపల్లెకు తరలించారు. విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఒంగోలు ట్రిపుల్‌ఐటి అధికారులు సందర్శించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ రంగారావు తెలిపారు.

ఉపాధి కల్పించేలా నూతన కల్లు విధానం

- మంత్రి కొల్లు రవీంద్రకు గీత కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కల్లు గీత కార్మికులకు ఉపాధి కల్పించేలా నూతన కల్లు విధానాన్ని రూపొందించాలని ఎపి కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వాకా రామచంద్రరావు, జుత్తిగ నరసింహమూర్తి, నాయకులు బి చంటి, బత్తిన నాగేశ్వరరావు, కడలి పాండు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎపి వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎం భాస్కరయ్య బుధవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైసిపి ప్రభుత్వం గీత వృత్తిలో వున్న లక్షలాది కుటుంబాలను సంక్షోభంలోకి పడేసిందని వివరించారు. ప్రభుత్వమే అక్రమ మద్యం, కల్తీ మద్యం అమ్మకాలను ప్రోత్సహించడంతో గీత వృత్తిదారులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కల్లు అమ్మకాలు దెబ్బతినేలా వ్యవహరించిందని అన్నారు. కనీసం కొత్త ప్రభుత్వంలోనైనా వృత్తిదారులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఆదరణ పథకాన్ని ప్రవేశ పెట్టాలని, ప్రతి తాటి చెట్టుకూ పది రూపాయలు చొప్పున పన్ను విధించి, వృత్తిదారులకు చెట్టుపై హక్కు కల్పించాలన్నారు. అలాగే వృత్తిలో ప్రమాదాలను నివారించేందుకు తెలంగాణ తరహాలో సేఫ్టీ మోకులు ప్రతి గీత కార్మికుడికీ ఇవ్వాలని కోరారు. గీత వృత్తిలో నైపుణ్యతను పెంచి వృత్తి సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి ఆధారంగా వృత్తిని ఆధునీకరించి నూతన కల్లు విధానం రూపొందించాలని కోరారు. ప్రకృతి పానీయం అయిన తాటి కల్లులో మంచి ఔషద గుణాలు, ఆరోగ్యకరమైన పోషకాలు వున్నాయని, శీతల పానీయాలకు బదులుగా నీరు, తాటి కల్లును ప్రోత్సహించాలని కోరారు. తాటి చెట్టుతో 200 రకాల ఉత్పత్తులు తయారు చేయొచ్చని, తాటి బెల్లం, పామ్ డ్రింక్స్ సిరప్ వంటివి తయారు చేయొచ్చన్నారు. నూతన ప్రభుత్వం మెరుగైన కల్లు విధానాన్ని తీసుకురావాలని కోరారు. ప్రమాదంలో మృతులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలన్నారు. తక్షణ దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని, వృత్తిదారులందరికీ ద్విచక్ర వాహనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిడదవోలులోని తాటిబెల్లం ఫెడరేషన్‌కు నిధులు కేటాయించి మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు.

నేడు టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో జరగనుంది. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ముఖ్యంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ, విశాఖ స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో అభ్యర్థిగా ఎవరిని పెట్టాలి? గెలుపు సాధించేందుకు ఎటువంటి ప్రణాళికలు అమలు చేయాలనే అంశంపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అంతేకాకుండా సూపర్ సిక్స్ అమలు, అభివృద్ధి కార్యక్రమాలపైనా పొలిట్‌బ్యూరోలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

చేనేతకు పూర్వ వైభవం : మంత్రి సవిత

- విజయవాడలో వాక్‌థాన్



విజయవాడలో జరిగిన వాక్‌థాన్‌లో మంత్రి ఎస్.సవిత, ముఖ్య కార్యదర్శి కె.సునీత, కమిషనర్లు రేఖారాణి, వాణీమోహన్, ఎంఎల్ఎ గద్దె తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

చేనేతకు పూర్వ వైభవం తెస్తామని రాష్ట్ర చేనేత, జౌళి, బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యాన విజయవాడలోని మేరీస్ స్టెల్లా కళాశాల వద్ద బుధవారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, కమిషనర్ జి.రేఖారాణి, ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ కమిషనర్ జి.వాణీమోహన్ తదితరులతో కలిసి ఆమె ప్రారంభించారు. "చేనేత వస్త్రాలు ధరిద్దాం.. చేనేత కళను ప్రోత్సహిద్దాం" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ నిర్వీర్యమైన చేనేతకు పూర్వ వైభవం తెస్తామన్నారు. నేతన్నలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ చేనేత కళపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఎండి ఆర్.పవనమూర్తి, జాయింట్ డైరెక్టర్లు కన్నబాబు, ఎం.నాగేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా చేనేత, జౌళి అధికారి ఎస్.రఘునందన్, ఎస్ఆర్ఆర్-సివిఆర్ కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసిలో మరో 5 శాతం వాటా విక్రయం..!

- పరిశీలనలో మోడీ ప్రభుత్వం



ఎల్‌ఐసిలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

న్యూఢిల్లీ : ప్రభుత్వానికి పన్నులు, డివిడెండ్ రూపంలో అత్యంత రాబడిని ఇస్తూ.. జీవిత బీమా రంగంలో దేశ ప్రజలకు విశేష సేవలందిస్తున్న ఎల్‌ఐసిలో మరో 5 శాతం వాటాను విక్రయించాలని మోడీ సర్కార్ యోచిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ వాటాలను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ది హిందూ బిజినెస్ లైన్ నివేదిక ప్రకారం.. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపిఎస్) నిబంధనలకు అనుగుణంగా బీమా దిగ్గజం ఎల్‌ఐసిలో వాటాల ఉపసంహరణ చేపట్టనుంది. ఎల్‌ఐసిలో ప్రస్తుతం కేంద్రానికి 96.5 శాతం వాటా ఉంది. కేంద్రం తన వాటాను తగ్గించుకోవడానికి ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పిఒ), క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి) విధానాలను పరిశీలిస్తోంది. 2022 మేలో ఎల్‌ఐసి ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వచ్చింది. ఈ ఇష్యూ ద్వారా కేంద్రం రూ.2,1000 కోట్లను తన ఖజానాలో వేసుకుంది. ఈ ఐపిఒ దేశ మార్కెట్లలోనే అతిపెద్దది కావడం విశేషం. ఇందులో రూ.10 ముఖ విలువ కలిగిన 22,13,74,920 ఈక్విటీ షేర్లను రూ.949 చొప్పున విక్రయించింది. నాటి ఐపిఒ ధరతో పోల్చితే బుధవారం నాటి ఎల్‌ఐసి షేర్ ధర రూ.1,124తో 5 శాతం వాటాలను విక్రయిస్తే.. అప్పటి కంటే భారీ మొత్తంలో నిధులు పొందవచ్చని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలను బలి చేయడానికి మోడీ సర్కార్ పిఎస్‌యుల్లో కనీసం 25 శాతం వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయించడానికి వీలుగా కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపిఎస్) నిబంధనలు తీసుకువచ్చింది. 2032 నాటి కల్లా ఎల్‌ఐసిలోనూ కనీసం 25 శాతం వాటాలను ప్రయివేటు శక్తులకు అప్పగించాలని నిర్ణయించింది.

బాధ్యతలు స్వీకరించిన టిటిడి సివిఎస్‌ఒ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య భద్రత అధికారిగా (సివిఎస్‌ఒ) ఎస్ శ్రీధర్ బుధవారం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పిగా పనిచేసిన శ్రీధర్ బదిలీ నిమిత్తం టిటిడి ముఖ్య భద్రతాధికారిగా బదిలీ అయ్యారు. బుధవారం శ్రీవారిని దర్శించుకుని అనంతరం ఆలయంలోనే ఆయన బాధ్యతలు స్వీకరించారు.

13న శ్రీహరికోటకు పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు ఈ నెల 13న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ (శ్రీహరికోట)లో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా రానున్నారు. ఇస్రో ఆధ్వర్యాన గత నెల 14 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ వేడుకలు ఒడిశా, పుదుచ్చేరి, తమిళనాడు, గుంటూరులో నిర్వహించారు. షార్ వేదికగా ఈ నెల 13న శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రంలో జరగనున్న ఈ కార్యక్రమానికి పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు.

వైసిపికి మాజీ ఎమ్మెల్యే దొరబాబు రాజీనామా

ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)



కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం వైసిపి మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. పిఠాపురంలోని వైసిపి కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. తాను 24 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, రెండు పర్యాయాలు పిఠాపురం ఎమ్మెల్యేగా పని చేశానని తెలిపారు. నియోజవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా నియోజవర్గ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేశానని తెలిపారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోయినా వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోసమే పని చేశానన్నారు. తనకు వైసిపితోగానీ, జగన్‌తో గానీ ఎటువంటి విభేదాలు లేవన్నారు. తన అనుచరులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల సూచన మేరకే వైసిపికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. అయితే, జనసేనలో చేరేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లోనే ఆయన జనసేన కండువా కప్పుకోనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

గిగ్ వర్కర్ల ఆదాయం అంతంతే..

- ఏడాదికి రూ.2.5 లక్షలే



న్యూఢిల్లీ : మెజారిటీ డెలివరీ బాయ్స్ (గిగ్ వర్కర్లు) అల్పాదాయాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. దేశంలోని 77.6 శాతం మంది డెలివరీ కార్మికుల సంవత్సరానికి రూ.2.5 లక్షల కంటే తక్కువ సంపాదిస్తున్నారని మనీకంట్రోల్ ఓ కథనంలో తెలిపింది. 40 నగరాల నుండి 2,000 మంది గిగ్ డెలివరీ వర్కర్లను సర్వే చేయగా.. ఈ కార్మికులలో దాదాపు 20 శాతం మంది వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల నుండి రూ. 5 లక్షల మధ్య ఉందని తేలింది. కేవలం 2.6 శాతం మంది కార్మికులు మాత్రమే రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు సంపాదిస్తున్నారని వెల్లడయ్యింది. పోర్టర్, జొమాటో, స్విగ్గి, ఉబెర్, ఢిల్లీవెరీ, ఓలా, షాడోఫ్యాక్స్, రాపిడో, జెప్టో, షిప్రోకెట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, డన్జో, ఈకామ్ ఎక్స్‌ప్రెస్, ఎకార్ట్, డొమినోస్, జియో మార్ట్, అర్బన్ కంపెనీ వంటి బహుళ ప్లాట్‌ఫారమ్‌ల కోసం పనిచేస్తున్న డెలివరీ సిబ్బంది నుండి ఈ డేటా సేకరించింది.

డెల్‌లో 12,500 మంది ఉద్యోగులపై వేటు



న్యూయార్క్ : ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం డెల్ తన 12,500 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఈ సంఖ్య మొత్తం సంస్థ ఉద్యోగుల్లో 10 శాతానికి సమానం కావడం ఆందోళనకర అంశం. తొలగింపుల విషయాన్ని ఉద్యోగులకు హెచ్‌ఆర్ ఎగ్జిట్ మీటింగ్‌లో తెలిపారు. దీంతో గడిచిన 15 నెలల్లో రెండవ సారి ఉద్వాసనలు చేపట్టినట్లయ్యింది. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, ఆధునిక ఐటి సొల్యూష´న్స్‌లో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఉద్దేశించిన విస్తృత పునర్వ్యవస్థీకరణలో ఈ తొలగింపులను చేపట్టామని డెల్ గ్లోబల్ సేల్స్ అండ్ కస్టమర్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ బిల్ స్కానెల్, గ్లోబల్ ఛానెల్స్ ప్రెసిడెంట్ జాన్ బైర్న్ మెమో తెలిపారు. ఉద్యోగుల తొలగిం పులు బాధాకరమే అయినప్పటికీ భవిష్యత్ వృద్ధి కోసం అనివార్యంగా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. డెల్ గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ దాదాపు 13,000 మంది ఉద్యోగులను తొలగించింది. ప్రస్తుత తొలగింపులతో డెల్ వర్క్‌ఫోర్స్ 1.2 లక్షల నుంచి లక్ష ఉద్యోగులకు తగ్గనుంది.

బంగ్లాదేశ్‌తో వాణిజ్యం తగ్గొచ్చు : ఎస్అండ్‌పి

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిణామాల వల్ల ఆ దేశంలో భారత వాణిజ్యం తగ్గొచ్చని ఎస్అండ్‌పి పేర్కొంది. అయితే ఈ ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండకపోవచ్చని తెలిపింది. 2023-24లో బంగ్లాదేశ్‌కు భారత్ రూ.92వేల కోట్లు ఉత్పత్తులను ఎగుమతి చేసిందని పేర్కొంది. అంతక్రితం ఏడాది రూ.లక్ష కోట్లతో పోల్చితే కొంత తగ్గిందని పేర్కొంది.

ఎడెల్‌వీస్ లైఫ్‌తో క్యాపిటల్ ఎస్ఎఫ్‌బి భాగస్వామ్యం

న్యూఢిల్లీ : ఎడెల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (కాపిటల్ ఎస్ఎఫ్‌బి) తెలిపింది. ఈ సహకారంతో తమ ఖాతాదారులు ఎడెల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ సమగ్ర జీవిత బీమా ఉత్పత్తులను పొందే వెసులుబాటు, ఆర్థిక భద్రత పరిష్కారాలు లభించనున్నాయని కాపిటల్ ఎస్ఎఫ్‌బి ఎండి, సిఇఒ సర్వజిత్ సింగ్ సమ్రా తెలిపారు. ఈ ఒప్పందం తమ సామర్థ్యాన్ని పెంచనుందన్నారు.



దక్షిణాది మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి

- పాలసీ బజార్ డైరెక్టర్ ప్రవీణ్ చౌదరి



హైదరాబాద్ : దక్షిణ భారత దేశంపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు ప్రముఖ బీమా ప్లాట్‌ఫారమ్ పాలసీబజార్ డైరెక్టర్ సజ్జా ప్రవీణ్ చౌదరి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల్లో బీమా రంగం వృద్ధి, ప్రాధాన్యతలను వివరించారు. టర్మ్, వైద్య, సేవింగ్ ప్లాన్లలో ఏడాదికేడాదితో పోల్చితే 10 శాతం పెరుగుదల ఉంటుందన్నారు. యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లు లేదా రూ. 25 లక్షలు యులిప్‌లలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఇప్పుడు ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

బంధన్ ఎంఎఫ్ నుంచి నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్

హైదరాబాద్ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ ఇండెక్స్ ప్రముఖ బ్యాంకులను కలిగి ఉందని పేర్కొంది. ప్రయివేటు రంగ బ్యాంకులు 85 శాతం వాటాను, మిగిలిన భాగాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు కలిగి ఉంటాయని తెలిపింది. ఈ కొత్త ఫండ్ 2024 ఆగస్ట్ 8న తెరువబడి 22న ముగుస్తుందని బంధన్ ఎంఎఫ్ సిఇఒ విశాల్ కపూర్ తెలిపారు.

సంపాదకీయం


టాక్స్ టెర్రరిజం!

జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంలపై 18 శాతం జిఎస్‌టి విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అత్యంత దుర్మార్గం. ఆపద వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఆ కష్టాన్ని సైతం ఖజానాను నింపుకోవడానికి మార్గంగా చూడటం అమానుషం! సొంత పార్టీ నుండే వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, సీనియర్ నేతలే ఈ నిర్ణయాన్ని తప్పు పడుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం కష్టకాలంలోనూ ప్రజల మూలుగులను పీల్చి పిప్పి చేయాలనే భావిస్తోంది. అందుకే ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని టాక్స్ టెర్రరిజంగా అభివర్ణిస్తున్నాయి. జిఎస్‌టిలో వివిధ వస్తువులు, సేవలపై సున్నా నుండి గరిష్టంగా 28 శాతం వరకు పన్నులు విధించవచ్చు. ఈ పట్టికలో చివరి నుండి రెండవ స్థానంలో ఉన్న 18 శాతం జిఎస్‌టిని బీమాపై పాలసీలపై విధిస్తున్న కేంద్రం బంగారంపై మూడు శాతం, వజ్రాలపై 0.25 శాతం మాత్రమే పన్ను వసూలు చేస్తుండటం గమనార్హం. కొన్ని సంవత్సరాలుగా బీమా కంపెనీలు రకరకాల కారణాలు చెబుతూ ప్రీమియం మొత్తాలను ఇష్టా రాజ్యంగా పెంచుతున్నాయి. ఈ పెంపును నియంత్రించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. రెండు సంవత్సరాల క్రితం 22 సంవత్సరాలున్న ఒక వ్యక్తి ఐదు లక్షల రూపాయల బీమా మొత్తానికి పది వేల రూపాయలు ప్రీమియంగా చెల్లించే పరిస్థితి ఉంటే, ఈ ఏడాది ఆ ప్రీమియం 15 వేల రూపాయలకు చేరింది. ఇదే తలకు మించిన భారంగా మారుతుండటంతో అనేక మంది తమ పాలసీలను రద్దు చేసుకుంటున్నారు. ఇప్పుడు 18 శాతం జిఎస్‌టి విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా ఉన్నప్పటికీ రోగగ్రస్థ దేశంగా మారే ప్రమాదం ఉంది.

నయా ఉదారవాద విధానాలు అమలు చేస్తున్న పాలక వర్గాలు ఒక వ్యూహం ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. వైద్య సేవల కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడక తప్పని స్థితిని సామాన్యులకు కల్పించాయి. ప్రైవేటు రంగానికి లాభాల లెక్కలే కీలకం కావడంతో వైద్యం సాధారణ ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ వైద్య రంగాన్ని తిరిగి పట్టాలెక్కిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెబుతున్నప్పటికీ ఆచరణలో అవి అమలుకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితే వైద్య రంగంలో బీమా ఆవశ్యకతను పెంచాయి. ఈ ఏడాది ప్రారంభంలో దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో లండన్ స్కూల్ ఆఫ్ హైజిన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ సంస్థ టి.బి రోగులపై ఒక సర్వే నిర్వహించగా 30 నుండి 61 శాతం మంది ఆర్థిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో చికిత్సను తీసుకోలేకపోయారని తేలింది. వీరికి ఆరోగ్య బీమా ఉండి ఉంటే పరిస్థితి మెరుగ్గా ఉండేదని ఆ సంస్థ పేర్కొంది. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నప్పటికీ దేశ వ్యాప్తంగా 2021 గణాంకాల ప్రకారం 40 కోట్ల మంది ఎటువంటి ఆరోగ్య బీమా లేకుండా ఉన్నారు. మరోవైపు ప్రభుత్వ బీమా పథకాలకు నిధుల కొరత వెంటాడుతుండటంతో అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు వైద్య సేవలను నిరాకరిస్తున్నాయి.

తాజా గణాంకాల ప్రకారం నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ బారిన పడి దేశంలో ఏటా 58 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. మెర్సర్ మార్ష్ బెనిఫిట్స్ (ఎమ్ఎమ్‌బి) హెల్త్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం ఆసియా ఖండంలోని మెడికల్ క్లయిమ్‌లలో 55 శాతం క్యాన్సర్, 43 శాతం రక్తప్రసరణ వ్యవస్థ ఆధారిత వ్యాధులు ఉంటున్నాయి. మన దేశంలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. జీవన శైలిలో మార్పులు, పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కారణంగా ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలను కొనుగోలు చేయడం తప్పనిసరి అవసరంగా మారింది. ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంల పైనే ప్రభుత్వానికి గత ఆర్థిక సంవత్సరంలో 8,263 కోట్ల రూపాయలు వసూలైందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. అది చాలదన్నట్లు మరింతగా ప్రజల నుండి వసూళ్లు చేయాలని కేంద్రం భావిస్తోంది. 18 శాతం జిఎస్‌టి విధించడం ద్వారా ఏటా 24 వేల కోట్ల రూపాయలు కేంద్ర బొక్కసానికి చేరుతాయని అంచనా! ప్రజల రక్త మాంసాలతో ఖజానాను నింపాలని చూడటం సబబు కాదు. దుర్మార్గమైన ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి.

మహనీయుల మాట



ఈనాడు విజ్ఞానంగా భావిస్తున్నదంతా గతంలో కొంత మంది గొప్ప వ్యక్తుల శ్రమ ఫలమే.

- హెచ్.డబ్ల్యు. లాంగ్‌ఫెలో, అమెరికన్ కవి, విద్యావేత్త.

విశ్లేషణ

కాలం చెల్లిన ఆలోచనలతో అభివృద్ధి జరగదు



వి. శ్రీనివాసరావు



గత ఎన్నికల్లో బిజెపి ని ప్రజలు ఛీత్కరించడంతో విజన్ 2047 పేరుతో వికసిత్ భారత్ అంటూ మోడీ మరోసారి జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే నమూనాలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ అంటూ మన కొత్త రాష్ట్ర ప్రభుత్వం కూడా పల్లవి అందుకున్నది. ఈ నెల 5వ తేదీన జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి వికసిత్ భారత్ నమూనాలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ గురించి దిశానిర్దేశం చేశారు. ఏ ప్రభుత్వానికి లేదా ప్రభుత్వ అధిపతికైనా ఒక విజన్ ఉండాల్సిందే. దీర్ఘకాలిక దృష్టి ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి అవుతుందనడంలో కూడా సందేహం లేదు. కాని ఆ విజన్ ఎలాంటిది అన్నది ముఖ్యమైంది. కొద్దిమంది శత కోటీశ్వరులకు ప్రజల సంపదను దోచి పెట్టేందుకా లేక అశేష ప్రజానీకం జీవన ప్రమాణాలను పెంచేదిగా ఉండాలా? గత పదేళ్ల అనుభవం మోడీ విజన్ వినాశకరమైందని రుజువైంది. నిరుద్యోగం, పేదరికం, అసమానతలు పెరిగాయి. పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే కానీ కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన నివేదిక కానీ ఈ విషయాన్ని అక్షరాలా రుజువు చేస్తున్నది. అందుకే మోడీ లేదా చంద్రబాబుల విజన్ 2047 భవిష్యత్తుకి తోడ్పడేది కాదని స్పష్టమవుతుంది.

ప్రజలు లేని విజన్ 2047

2047 ప్రణాళిక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలును ప్రకటించింది. అక్టోబర్ రెండు నుండి ప్రణాళిక అమలవుతుంది. దీనికి ముందు ఆగస్టు 31 లోగా సన్నాహక దశ, సెప్టెంబర్ 15 వరకు కన్సల్టేషన్ దశ, సెప్టెంబర్ 20 రిపోర్టింగ్ ఫేజ్. దీన్ని ప్రకటించడానికి ముందు విజన్ 2020 సమీక్ష చేస్తే విజన్ 2047 భవిష్యత్తు అర్థమవుతుంది. గతంలో ఆర్థిక సంస్కరణలు మంచి ఫలితాలనిచ్చాయని చంద్రబాబు అంటున్నారు. గత ప్రైవేటీకరణ విధానాలు 3 'పి' లపై ఆధారపడగా ఇప్పుడు కొత్తగా మరో 'పి' (పీపుల్)ని చేర్చి 4 'పి' గా నామకరణం చేశారు. ఈ విజన్‌లో పేదరిక నిర్మూలన, సామాజిక, భౌతిక ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధి సాధించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రజలకు కావాల్సిన ప్రాథమిక సౌకర్యాలలో ముఖ్యమైనవి: ఒకటి మంచినీళ్లు రెండు విద్యుత్, మూడు వైద్యం, నాలుగు విద్య, ఐదు భూమి, ఆస్తుల నిర్వహణగా పేర్కొన్నారు. జీరో పేదరికం విజన్‌లో ముఖ్యాంశమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉపాధి హామీ లాంటి చట్టాలు, సంక్షేమ పథకాల వల్ల పేదరికం తగ్గుతున్నట్లు కనిపిస్తున్నది. ఇక్కడ ముఖ్యమైన విషయం ఆర్థిక అసమానతల్ని తగ్గించడం. గత సంస్కరణల ఫలితంగా ఆర్థిక, ప్రాంతీయ, సామాజిక, లింగ అసమానతలు దారుణంగా పెరిగాయన్నది వాస్తవం. నాలుగో 'పి' లోని పీపుల్ పాత్ర ఏమిటి? ప్రజల భాగస్వామ్యం పేరుతో వారి భూములను, ఆస్తులను పెట్టుబడిగా మార్చడానికి, మధ్యతరగతి మదుపును షేర్లుగా మార్చడానికి ఉద్దేశించబడింది. రాజధాని ప్రజల అగచాట్లు, సిపిఎస్‌పై ఉద్యోగుల ఆందోళన గమనించాక ఎవరికైనా ఇది సులభంగా అర్థమవుతుంది.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు అందించిన లెక్కలనే పరిశీలిద్దాం. ఉదాహరణకు మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకమైన వ్యవసాయ రంగాన్ని చూద్దాం. రాష్ట్ర విభజన తర్వాత 2014 నుండి ఇప్పటి వరకు పదేళ్లలో ప్రాథమిక రంగంలో వ్యవసాయం వాటా 27.34 నుండి 10.92 శాతానికి పడిపోయింది. ప్రైమరీ సెక్టార్ వాటా పెరిగినప్పటికీ వ్యవసాయం వాటా తగ్గటం, పెరుగుదల లేకపోవడం రాష్ట్ర అభివృద్ధి సూచికను దిగువకు నెట్టేసింది. 2014-15 నుండి 2018-19 వరకు వ్యవసాయంలో పెరుగుదల రేటు (జివిఏ) 8.31 నుండి 4.6 శాతానికి తగ్గింది. 2019-20 నుండి 2023-24కి 5.57 నుండి 3.73 శాతం తగ్గింది. రాష్ట్రంలో పారిశ్రామిక ఉత్పత్తి పాత్ర 25 శాతం అటు ఇటుగా అదే కొనసాగుతుంది. అభివృద్ధి లేదు. సర్వీస్ సెక్టార్ 44 నుండి 40 శాతానికి తగ్గిపోయింది. సర్వీస్ సెక్టార్ తగ్గినందువల్ల వ్యవసాయంలో పెరుగుదల కనిపిస్తుంది తప్ప నిజానికి వ్యవసాయంలో పెరుగుదల లేదు.

పంటల వారీగా చూస్తే వరి ఉత్పాదకత పంజాబ్, హర్యానా, తమిళనాడు కన్నా మన రాష్ట్రంలో 1100 కిలోలు తక్కువగా ఉంది. అలాగే మొక్కజొన్న, కందులు, వేరుశనగ, పత్తి కూడా తక్కువగా ఉంది. జిల్లాల వారీగా చూస్తే వరిలో గుంటూరు జిల్లా అత్యధిక ఉత్పాదకత కలిగి ఉండగా, మొక్కజొన్న చిత్తూరు, కందులు ఎన్టీఆర్, వేరుశనగ నెల్లూరు, పత్తి కాకినాడ జిల్లాలలో ఎక్కువ ఉన్నది. వరి మినహా మిగతా పంటల విషయంలో ఆ పంటలు అత్యధికంగా పండిస్తున్న జిల్లాలు, ప్రాంతాలలో తక్కువగా ఉన్న విషయం గమనించాలి.

వ్యవసాయ రంగంలో కౌల్దార్ల స్థానం ఎక్కడ?

కౌలుదారుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. మొత్తం వ్యవసాయ రుణం రూ.2 లక్షల 64 వేల కోట్లు కాగా ఇందులో కౌలుదారుల వాటా రూ.4 వేల కోట్లు మాత్రమే. 10 లక్షల సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని లక్ష్యం కాగా 6,40,000 అంటే 65 శాతం ఇచ్చారు. అందులో కౌలుదారీ విధానం అధికంగా ఉన్న జిల్లాలలో తక్కువగాను, వ్యాపార పంటలు, రివర్స్ కౌలు వున్న జిల్లాల్లో ఎక్కువగాను కార్డులు ఇచ్చారు. దీన్నిబట్టి కౌలుదారీ కార్డుల జారీలో కూడా పెత్తందారుల ఆధిపత్యం కనిపిస్తున్నది.

పారిశ్రామిక ప్రగతి ఎక్కడ?

మన రాష్ట్రంలో వివిధ పారిశ్రామిక కేంద్రాలను పరిశీలిస్తే ఈ కింది విషయాలు మనకు అర్థం అవుతాయి. ఒకటి-పరిశ్రమలు పెట్టిన చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడా ప్రజల జీవన ప్రమాణాలు పెరగలేదు. రెండు-ఇతర రాష్ట్రాల కార్మికులు వచ్చి ఇక్కడ పని చేస్తున్నందువల్ల విద్వేషాలు పెరుగుతున్నాయి. నిరుద్యోగుల్లో అసహనం వ్యాపిస్తున్నది. మూడు-పారిశ్రామిక కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. నాలుగు-వారి ఆదాయంలో అధిక భాగం మందులు కొనడానికే సరిపోతున్నది. ఐదు- పర్యావరణ కాలుష్యంతో పాటు పరిశ్రమల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ ధరలు పెరగటం వల్ల పేద రైతులు, మధ్యతరగతి రైతులు భూములు కోల్పోతున్నారు. అంటే నిరాస్తిపరులవుతున్నారు. స్థానికంగా పనుల్లేక వలసలు పోతున్నారు. అసైన్డ్ ల్యాండ్స్ అన్యాక్రాంతం అవుతున్నాయి. రైతుల చేతుల నుండి భూములు చేజారిపోయాక వారు నిరాస్తిపరులవుతున్నారు. అదే భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ఎక్కువ విలువకు ఎక్కువ రుణాలు తెచ్చుకొని ఆ తర్వాత ఎగ్గొట్టి పారిశ్రామికులు లాభపడుతున్నారు. రైతు, కూలీల శ్రమపై వారి ఆస్తిపాస్తులపై కార్పొరేట్ ఆధిపత్యం సంపాదించుకుంటున్నది. ఏ గ్రామం పర్యటించినా, పారిశ్రామిక వాడలను పరిశీలించినా మనకు కనపడుతున్న దృశ్యాలు ఇవే. అందువల్ల ఇప్పటికే పారిశ్రామిక కేంద్రాలుగా ఉన్న క్లస్టర్లలో ప్రజల జీవన ప్రమాణాలను పరిస్థితులను సర్వే చేసి దానికి అనుకూలమైనటువంటి రీతిలో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలి. దానికి బదులుగా విజన్ పేరుతో స్పెక్యులేషన్‌పై ఆధారపడి విధానాలు రూపొందిస్తే (ఊహాజనిత పెట్టుబడి) ప్రజల ఆశలు ఆవిరై నిస్పృహకు గురవుతారు. ఈ విషయాన్ని పాలకులు గమనంలో పెట్టుకోవాలి. సోమవారం కలెక్టర్ల సమావేశంలో అధికారులు, ముఖ్యమంత్రి, వివిధ శాఖల అధిపతులు మాట్లాడిన తీరు చూస్తుంటే వారు వాస్తవిక దృక్పథంతో ఉన్నట్లు కనిపించడం లేదు. ఎంత మంచి ప్రణాళికలు అయినా కాగితాల మీద ఉంటాయి తప్ప ఆచరణకు నోచుకోవు. రాజకీయ పట్టుదలతో పాటు ఆచరణాత్మక ప్రణాళిక, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించే ప్రణాళిక ఈనాటి ఆవశ్యకత.

ఎక్కడైనా అభివృద్ధి జరుగుతున్నది అంటే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. కానీ మన రాష్ట్ర పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉన్న పెట్టుబడులు రాష్ట్రం వదిలి పోయాయని, వాటిని తిరిగి రప్పించడానికి ప్రయత్నిస్తున్నామని చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రయత్నం మంచిదే. కానీ ఎక్కడైనా ఎప్పుడైనా పెట్టుబడి లాభాలను కోరుకుంటుంది. అది ప్రజలను పిండేస్తుంది. సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రాల మధ్య పోటీ పెరిగి వనరులన్నిటిని ఆయాచితంగా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. దీనికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని ముద్దు పేరు పెట్టారు. ఆ పేరుతో భూములు కట్టబెట్టడం, చౌకగా విద్యుత్తు, నీరు ఇతర సౌకర్యాలు కల్పించడం... ఉత్పత్తి జరిగినా జరగకున్నా, రాష్ట్రానికి ఉపాధి కల్పించినా కల్పించకున్నా...పన్ను రాయితీలు, వడ్డీ రాయితీలు ఇవ్వటం...ఆ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు సంపద కట్టబెట్టడం జరుగుతున్నది. విజన్ 2047లో కీలకమైన అంశం ఇదే.

కేంద్రీకృత ప్రణాళిక అనర్థదాయకం

ఈ విజన్‌లోని మరో ముఖ్యమైన అంశం కేంద్రీకృత ప్రణాళిక. కంట్రీ టు విలేజ్. ఈ కేంద్రీకృత విధానం ఫలితాలను ఇవ్వదని ఇప్పటికే రుజువైంది. భారతదేశ ప్రత్యేక పరిస్థితులలో గ్రామీణ, ప్రాంతీయ ప్రణాళికల ఆవశ్యకత ఎక్కువ. స్థానిక సంస్థల భాగస్వామ్యం పెరగాలి. ఈ విజన్‌లో దానికి స్థానం లేదు. గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వమూ చేస్తున్నది. విజన్ 2047 అంటే కేవలం జిడిపి లేదా జిఎస్‌డిపి పెరగటం కాదు. పెరిగిన సంపద ఫలాలు ప్రజలందరికీ చెందాలి. అసమాన పంపిణీ వల్ల సంపద కేంద్రీకరణ జరిగి అత్యధికమంది కొనుగోలు శక్తి పడిపోయి ఉత్పత్తి తగ్గుతున్నది. అంతర్జాతీయ మార్కెట్ మందగమనంలో వున్న స్థితిలో జాతీయ మార్కెట్టును విస్తరించుకోకుండా ఉత్పత్తి పెరగదు.

జాతీయ మార్కెట్ పెరగాలంటే ప్రజల ఆదాయాలు పెరగాలి. ఆదాయం పెరగటానికి ప్రధానమైన వనరులు రైతులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, పారిశ్రామిక కార్మికులకు ఉపాధి భద్రత, కనీస వేతనాలు, చిన్నచిన్న వ్యాపారస్తులకు, వృత్తిదారులకు రక్షణ. ఈ అంశాలకు ఎంత ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తే అంతగా అంతర్గత మార్కెట్ విస్తరించి అభివృద్ధికి పునాది పడుతుంది. అసమానతలను రూపుమాపకుండా కొనుగోలు శక్తి పెరగదు, ప్రమాణాలు పెరగవు. ప్రజల ఆదాయాలు పెరగకుండా జీవన ప్రమాణాలు మెరుగవ్వకుండా అభివృద్ధి అనేదానికి అర్థం ఉండదు.

పెట్టుబడికి కాదు.. శ్రమకు పెద్ద పీట వేయాలి

1999లో నాడు ప్రపంచబ్యాంకు సౌజన్యంతో చంద్రబాబు నాయుడు విజన్ 2020ని ప్రకటించారు. నేడు ప్రపంచబ్యాంకు స్థానాన్ని నీతి ఆయోగ్ ఆక్రమించింది. ప్రపంచబ్యాంకు షరతుల స్థానంలో కేంద్ర ప్రభుత్వమే షరతులు విధిస్తున్నది. రోజురోజుకీ రాష్ట్రాలపై కేంద్రం ఆధిపత్యం పెరుగుతోంది. ఈ స్థితిలో మన రాష్ట్రం అభివృద్ధి గురించి కలలు కనడం అత్యాశే అవుతుంది. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా షేర్ మార్కెట్లు క్రాష్ అవుతున్న స్థితిలో భారతదేశం అతీతంగా ఉండలేదు. విజన్ 2047 గురించి వాస్తవిక దృక్పథంతో వ్యవహరించడం మంచిది. 21వ శతాబ్దపు ప్రారంభంలో ఉన్నట్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నేడు లేదు. బూమ్ దశ దాటిపోయి సంక్షోభ దశలో ప్రవేశిస్తున్న స్థితిలో పాత అభివృద్ధి నమూనా చెల్లదు. ఎక్కడైనా అభివృద్ధి జరుగుతున్నది అంటే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. కానీ మన రాష్ట్ర పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉన్న పెట్టుబడులు రాష్ట్రం వదిలి పోయాయని, వాటిని తిరిగి రప్పించడానికి ప్రయత్నిస్తున్నామని చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రయత్నం మంచిదే. కానీ ఎక్కడైనా, ఎప్పుడైనా పెట్టుబడి లాభాలను కోరుకుంటుంది. అది ప్రజలను పిండేస్తుంది. సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రాల మధ్య పోటీ పెరిగి వనరులన్నిటిని ఆయాచితంగా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. దీనికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని ముద్దు పేరు పెట్టారు. ఆ పేరుతో భూములు కట్టబెట్టడం, చౌకగా విద్యుత్తు, నీరు ఇతర సౌకర్యాలు కల్పించడం...ఉత్పత్తి జరిగినా జరగకున్నా, రాష్ట్రానికి ఉపాధి కల్పించినా కల్పించకున్నా...పన్ను రాయితీలు, వడ్డీ రాయితీలు ఇవ్వటం...ఆ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు సంపద కట్టబెట్టడం జరుగుతున్నది. విజన్ 2047లో కీలకమైన అంశం ఇదే.

ప్రత్యేక హోదాతోనే అభివృద్ధి

ఈ పోటీలో నిలబడాలంటే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న భౌగోళిక పరిస్థితులలో ఎవరూ పెద్దగా ముందుకు రారు. వారిని రాబట్టాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలి. కేంద్రం ప్రత్యేక హోదా నిరాకరిస్తున్న స్థితిలో దాన్ని సాధించడానికి బదులు ఆ రాయితీలనే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటానికి సిద్ధపడటం అంటే రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టటమే. అందువలన ఏ ప్రభుత్వం అయినా రాష్ట్రాన్ని త్వరగా అభివృద్ధి చేయాలంటే ముందు కేంద్రంతో పోరాడి ప్రత్యేక హోదా సాధించాలి. రాష్ట్ర విభజన సందర్భంగా చేసుకున్న ఈ ఒప్పందం ఈరోజుకీ అమలు కాకపోవడానికి మోడీ ప్రభుత్వ విద్రోహం ప్రధాన కారణం. ఈ అనుభవం నుండి పాఠం నేర్చుకుని కేంద్రం నుండి ప్రత్యేక హోదా సాధించడం విజన్ 2047 మొదటి లక్ష్యంగా ఉండాలి.

/ వ్యాసకర్త సిపిఎం ఎ.పి రాష్ట్ర కార్యదర్శి /

అంతర్జాతీయం

బంగ్లాదేశ్ నేర్పుతున్న పాఠాలు

భారత్, చైనా, రష్యాలతో సమానంగా స్నేహపూర్వకంగా మెలిగే షేక్ హసీనాను గద్దె దించి...తమకు తలొగ్గే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అమెరికా పావులు కదుపుతోంది. తాత్కాలిక ప్రభుత్వ సలహాదారుగా డా॥ మహమ్మద్ యూనస్ రాక వెనుక అమెరికా సహా పాశ్చాత్య శక్తుల ప్రభావం కనిపిస్తుంది. ప్రజాస్వామ్యంపై అమెరికా నిర్వహించే శిఖరాగ్ర సమావేశానికి హసీనాకు ఆహ్వానం అందలేదన్న వార్తలు కూడా వచ్చాయి. బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో సప్తమ నౌకాదళాన్ని పంపి, తాము పాకిస్తాన్ పక్షాన ఉన్నామని చెప్పిన అమెరికా, పాకిస్తాన్, జమాతే ఇస్లామీలు భారత ప్రయోజనాలకు హాని కలిగిస్తాయి. అమెరికా, జమాతే ఇస్లామీ జోక్యం, చొరబాటు ఉన్నప్పటికీ...షేక్ హసీనా అప్రజాస్వామిక, అవినీతిమయ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా తిరుగుబాటు ఆమెను అధికారం నుండి తరిమికొట్టింది. బంగ్లాదేశ్‌లో శాంతి, సుస్థిరతను పునరుద్ధరించేందుకు లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా నిలబడాల్సిన సమయమిది.





వి.బి. పరమేశ్వరన్

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా పదిహేనేళ్ల పాలన చరిత్ర గర్భంలో కలిసిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల నేపథ్యంలో షేక్ హసీనా, బ్రిటీష్ పౌరసత్వం గల ఆమె సోదరి షేక్ రహానా సోమవారం భారతదేశంలో ఆశ్రయం పొందారు. పొరుగున ఉన్న శ్రీలంకలో ఇదే విధమైన ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు కారణంగా అధ్యక్షుడు గోటబయ రాజపక్సే 2022లో మాల్దీవులకు పారిపోవాల్సి వచ్చింది. ఎన్నికల విజయం తర్వాత తమకు అధికారం సొంతమైంది అనుకున్న క్షణంలో రాజపక్సే, హసీనాలు రాజీనామాలు చేసి దేశం విడిచి వెళ్లాల్సి వచ్చింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో శ్రీలంక అధ్యక్షుడు పదవీచ్యుతుడు కాగా, రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం అనంతరం హసీనా తన అధికారాన్ని కోల్పోయారు. హసీనా అధికారాన్ని కోల్పోవడానికి ప్రధాన కారణం ఆమె తన ప్రజాస్వామ్య లక్షణాన్ని విడిచిపెట్టడమే. ఐదవసారి (1996-2001, 2009 నుండి 2024) అధికారంలోకి వచ్చిన తరువాత, 'తనే దేశం' అనే భ్రమలో పడిపోయింది. మొదట ఆమె ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్షాల గొంతు నొక్కేసింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి)ని వేటాడింది. ప్రతిపక్ష నేతలపై 40 లక్షల కేసులు నమోదయ్యాయి. నోబెల్ గ్రహీత, గ్రామీణ బ్యాంకు రూపకర్త అయిన మహ్మద్ యూనస్ మీద కూడా 171 కేసులు బనాయించారు.

ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతను నాశనం చేసింది. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నిర్వహించాలన్న విపక్షాల డిమాండ్‌ను తిరస్కరించింది (స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఎన్నికలకు మూడు నెలల ముందు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బంగ్లాదేశ్ రాజ్యాంగంలో నిబంధన ఉంది. షేక్ హసీనా హయాంలో రాజ్యాంగ సవరణ ద్వారా దీనిని తొలగించారు). జనవరి 7వ తేదీన జరిగిన చివరి ఎన్నికలను ఆమోదించకపోవడమే కాకుండా, దాని కోసం నిరసన తెలిపిన బిఎన్‌పి ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంఘీర్‌తో సహా 150 మందిపై హత్యానేరం మోపబడింది.

ఈ పరిస్థితిలో, బిఎన్‌పి సహా 14 రాజకీయ పార్టీలు ఎన్నికలను బహిష్కరించాయి. ఎన్నికలలో పాల్గొనకుండా 'జమాతే ఇస్లామీ' అనే ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపుపై కూడా నిషేధం విధించబడింది. అయితే ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలు సాధించిన విజయం సామాన్య ప్రజానీకంలో ఆదరణ పొందలేకపోయింది. రిజర్వేషన్లను వ్యతిరేకించడం కంటే ఈ ప్రజా వ్యతిరేక చర్యలే షేక్ హసీనా ప్రభుత్వాన్ని ప్రజలకు దూరం చేశాయి. దానికి తోడు, జన జీవన సమస్యల పరిష్కారంలో చూపిన అలసత్వం కూడా వారి పతనానికి దారితీసింది.

బంగ్లాదేశ్ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృషి చేసినది షేక్ హసీనా అని చెప్పడంలో సందేహం లేదు. అయితే, బంగ్లాదేశ్ పరిస్థితి శ్రీలంకకు భిన్నంగా ఉంటుంది. తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచిక, ఆర్థిక వృద్ధి పరంగా చూసినట్లయితే బంగ్లాదేశ్ భారత్ కంటే మెరుగైన స్థానంలో ఉంది. వస్త్ర రంగంలో ఆ దేశం సాధించిన అభివృద్ధి అపూర్వమైనది. అయితే, బంగ్లాదేశ్ జనాభాలో 20 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. జనాభాలో అత్యధికులు యువకులే. సహజంగానే, జమాతే ఇస్లామీ వంటి సంస్థలు ఇలాంటి సమస్యలను పరిష్కరించడంలో షేక్ హసీనా అలసత్వాన్ని ఉపయోగించుకున్నాయి. హిందూ మైనారిటీలను ప్రధాన స్రవంతిలో ఉంచిన, లౌకిక స్వభావం గల షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టడం లౌకికవాద వ్యతిరేకి జమాతే ఇస్లామీ, దాని మద్దతుదారైన అమెరికాకు అవసరం. మధ్యంతర ప్రభుత్వంలో ఈ శక్తులకు ప్రాధాన్యత లభించినట్లయితే భారత్‌తో స్నేహ సంబంధాలను కూడా దెబ్బతీస్తాయి.

ఈ నేపథ్యంలో...రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం కారణంగానే షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేశారనే ప్రజా కథనంపై కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లా విమోచన యోధుల కుటుంబాలకు 1972లో అమలు చేసిన 30 శాతం రిజర్వేషన్‌ను 2010లో వారి తర్వాతి తరాలకు కూడా వర్తింపచేశారు. కానీ 2018 నుంచి అది అమలులో లేదు. దాని పునరుద్ధరణకు మార్గం సుగమం చేసిన హైకోర్టు తీర్పుతో విద్యార్థులు నిరసనకు పిలుపునిచ్చారు. అయితే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నది విద్యార్థుల నినాదం కాదు. దీనిని సవరించాలని వారు డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ సుప్రీంకోర్టు చేసిన పని అదే. 30 శాతం రిజర్వేషన్‌ను 5 శాతానికి తగ్గించారు. మొత్తం రిజర్వేషన్లను 56 శాతం నుంచి 7 శాతానికి తగ్గించారు. దీంతో విద్యార్థులు వెనక్కి తగ్గారు.

అయితే షేక్ హసీనా రాజీనామా ప్రధాన డిమాండ్‌గా లేవనెత్తడంతో ఆదివారం ఒక్కసారిగా సమ్మె ఉధృత రూపం దాల్చింది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా నిలబడిన శక్తులు ఈ సమ్మెలో పాల్గొన్నాయని అంటున్నారు. 'జమాతే ఇస్లామీ' వంటి సంస్థలు ఈ పోరాటంలోకి చొరబడ్డాయని కూడా పరిశీలకులు భావిస్తున్నారు.

బంగ్లాదేశ్ విముక్తిని పాకిస్తాన్‌తో పాటుగా జమాతే ఇస్లామీ సైతం వ్యతిరేకించింది. ఇస్లామిక్ పాలనను కోరుకునే వారికి ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు. సోమవారం ఆర్మీ చీఫ్ వకార్ ఉస్మాన్ ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి బిఎన్‌పి, నిషేధిత జమాతే ఇస్లామీ, జతియా పార్టీ (హెచ్.ఎం ఎర్షాద్ పార్టీ)లకు ప్రధానంగా ఆహ్వానం అందింది. షేక్ హసీనా భారతదేశానికి సురక్షితంగా చేరుకోవడానికి ఇది మార్గం సుగమం చేసింది. వామపక్ష అభ్యుదయ 'వర్కర్స్ పార్టీ', కమ్యూనిస్ట్ పార్టీలను ఈ సమావేశానికి ఆహ్వానించలేదు. బిఎన్‌పి నాయకురాలు ఖలీదా జియాను జైలు నుంచి విడుదల చేయనున్నట్లు ఆర్మీ చీఫ్ ప్రకటించారు. తాత్కాలిక ప్రభుత్వంలో జమాతే ఇస్లామీదే పైచేయి అవుతుందని ఈ ఘటనల ద్వారా తెలుస్తున్నది. అమెరికా వారి వెంట ఉన్నది. జనవరి ఎన్నికలకు ముందు అమెరికా దౌత్యవేత్తలు జమాతే ఇస్లామీ నేతలతో చర్చలు జరిపారు. ఇస్లామిక్ జాతీయవాదులతో అమెరికా ప్రతిని ధులు జరిపిన చర్చలను చిన్నపాటి ఘటనగా కొట్టిపారేయలేం.

భారత్, చైనా, రష్యాలతో సమానంగా స్నేహపూర్వకంగా మెలిగే షేక్ హసీనాను గద్దె దించి...తమకు తలొగ్గే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అమెరికా పావులు కదుపుతోంది. తాత్కాలిక ప్రభుత్వ సలహాదారుగా డా॥ మహమ్మద్ యూనస్ రాక వెనుక అమెరికా సహా పాశ్చాత్య శక్తుల ప్రభావం కనిపిస్తుంది. ప్రజాస్వామ్యంపై అమెరికా నిర్వహించే శిఖరాగ్ర సమావేశానికి హసీనాకు ఆహ్వానం అందలేదన్న వార్తలు కూడా వచ్చాయి. బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో సప్తమ నౌకాదళాన్ని పంపి, తాము పాకిస్తాన్ పక్షాన ఉన్నామని చెప్పిన అమెరికా, పాకిస్తాన్, జమాతే ఇస్లామీలు భారత ప్రయోజనాలకు హాని కలిగిస్తాయి. అలా జరిగినట్లయితే అది భారత విదేశాంగ విధాన వైఫల్యంగా పరిగణించబడుతుంది. అమెరికా, జమాతే ఇస్లామీ జోక్యం, చొరబాటు ఉన్నప్పటికీ... షేక్ హసీనా అప్రజాస్వామిక, అవినీతిమయ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా తిరుగుబాటు ఆమెను అధికారం నుండి తరిమికొట్టింది. బంగ్లాదేశ్‌లో శాంతి, సుస్థిరతను పునరుద్ధరించేందుకు లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా నిలబడాల్సిన సమయమిది.

/'దేశాభిమాని' సౌజన్యంతో/

ఆల్మట్టి టు ప్రకాశం బ్యారేజ్
పోటెత్తిన కృష్ణా వరద

- నిండుకుండల్లా ప్రాజెక్టులు
- ప్రాజెక్టుల వద్ద పర్యాటకుల హడావిడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రధాన నదుల్లో వరద పోటెత్తింది. కృష్ణా బేసిన్‌పై వున్న సాగు నీటి ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. కర్నాటకలోని ఆల్మట్టి డ్యామ్ మొదలు చివరి ప్రాజెక్టు అయిన ప్రకాశం బ్యారేజ్ వరకు అన్ని ప్రాజెక్టుల్లోకి పూర్తిస్థాయి నీటి మట్టాలు చేరుకున్నాయి. దీంతో క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు భారీగా వరద నీటిని వదులుతున్నారు. ఈ దృశ్యాలను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రాజెక్టుల వద్దకు చేరుకున్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్ వద్ద పర్యాటకుల హడావిడి నెలకొంది. ఆల్మట్టి మొదలు దిగువన వున్న ప్రకాశం బ్యారేజ్ వరకు వున్న ప్రాజెక్టులు ఆగస్ట్ మొదటి వారంలోనే నిండిపోవడం కృష్ణా నది చరిత్రలో మొదటిసారి అని ఇంజనీర్లు చెబుతున్నారు. ఆల్మట్టి డ్యామ్ పూర్తి స్థాయి సామర్థ్యం 129.72 టిఎంసీలు కాగా ఇప్పటిదాకా ఈ ఏడాది ఇప్పటిదాకా 488.9 టిఎంసీల నీరు వచ్చింది. బుధవారం ఆల్మట్టిలోకి 2,95,580 క్యూసెక్కుల వరద వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. అలాగే ఆల్మట్టికి దిగువన వున్న నారాయణపూర్ డ్యామ్ 37.64 టిఎంసీలు కాగా ఈ సంవత్సరంలో ఇప్పటిదాకా 402.75 టిఎంసీల నీరు వచ్చి చేరింది. నారాయణపూర్ నుండి 2,04,317 క్యూసెక్కుల వరద వస్తుండే అంతే మొత్తంలో దిగువన జూరాలలోకి వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 9.66 టిఎంసీలు కాగా ఇప్పటిదాకా 349.01 టిఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం జూరాలలోకి 2,58,562 క్యూసెక్కులు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువ శ్రీశైలం ప్రాజెక్టులోకి వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 215.8 టిఎంసీలు కాగా దాదాపుగా పూర్తిస్థాయికి చేరుకుంది. తుంగభద్ర నది, జూరాల ప్రాజెక్టుల నుండి 4,18,761 క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు అంతే మొత్తంలో వదులుతున్నారు. అలాగే తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయి సామర్థ్యం 105.79 టిఎంసీలు కాగా ప్రాజెక్టులోకి ఇప్పటిదాకా 264.79 టిఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లోకి 67,394 క్యూసెక్కులు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. దీంతో నాగార్జున సాగర్ పూర్తి స్థాయి సామర్థ్యం 312 టిఎంసీలు కాగా ఇప్పటికే 208 టిఎంసీల నీరు కొత్తగా వచ్చి చేరింది. ఎగువనుండి భారీగా వరద నీరు వస్తుండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లోకి 3,17,558 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 3.4లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. సాగర్‌కు దిగువన వున్న పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 45.77 టిఎంసీలుకాగా 40 టిఎంసీల నీరు చేరింది. చివరన వున్న ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం చేరుకోవడంతో మంగళవారం నుండి సముద్రం వైపు వరదను వదులుతున్నారు.



బుధవారం నాటికి 18 టిఎంసీల నీరు సముద్రంలో కలిసింది. అలాగే గోదావరిలోనూ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుండి గోదావరి నీళ్లు 6,32,654 క్యూసెక్కులు సముద్రంలోకి వెళుతున్నాయి. ఇప్పటిదాకా గోదావరి నదిలో 1701 టిఎంసీల నీరు సముద్రంలో కలిశాయి. గత ఏడాది ఇదే సమయానికి 1,328 టిఎంసీలు కలిశాయి.

కృష్ణా నదిలో వరద ప్రవాహం ఉధృతంగా వుండటంతో పోతిరెడ్డిపాడు నుండి ఇప్పటికే వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గోరుకల్లు రిజర్వాయర్‌లలో పూర్తిస్థాయిలో నీరు చేరడంతో కడప జిల్లాలో వున్న ప్రాజెక్టులకే నీటిని వదులుతున్నారు. అలాగే నెల్లూరులోని సోమశిల ప్రాజెక్టులోకి కూడా నీటి మళ్లింపు మొదలైంది. మొత్తంగా ఈ ఏడాది ఆగస్ట్ మొదటి వారం నాటికే కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో ఈ ఏడాది అయినా రెండో పంటకు నీరు ఇస్తారనే అంచనాతో రైతాంగం వుంది.

ప్రాజెక్టుల నుండి నీటి విడుదల ఇలా

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకున్నాయి. దీంతో ఎగువ నుండి వస్తున్న నీటిని దిగువకు వదులుతున్నారు. బుధవారం సాయంత్రం ఏడు గంటలకు వివిధ ప్రాజెక్టులోకి చేరుతున్న వరద, విడుదల చేస్తున్న నీటి వివరాలు :

ప్రాజెక్టుపేరు	ఇన్‌ఫ్లో	ఔట్ ఫ్లో
సుంకేశుల	47600 క్యూసెక్కులు	47600క్యూసెక్కులు
శ్రీశైలం డ్యామ్	3.32లక్షల క్యూసెక్కులు	4.2లక్షల క్యూసెక్కులు
నాగార్జున సాగర్	3.51లక్షల క్యూసెక్కులు	2.70లక్షల క్యూసెక్కులు
పులిచింతల	2.50 లక్షలక్యూసెక్కులు	2.88లక్షల క్యూసెక్కులు
ప్రకాశం బ్యారేజీ	1.50లక్షల క్యూసెక్కులు	1.50లక్షల క్యూసెక్కులు

విద్యుదాఘాతంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-ఏలూరు స్పోర్ట్స్

విద్యుత్ ఘాతానికి గురై ఏలూరు మున్సిపల్ కార్యాలయంలో నీటి పనులు, కులాయి పనులు కట్టించుకునే అసిస్టెంట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ లక్ష్మణ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన దాసరి అశోక్ కుమార్(37) స్థానికంగా ఏలూరు నగరంలో మున్సిపల్ కార్యాలయ బిల్ కలెక్టర్ వద్ద అసిస్టెంట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉదయం మంచినీరు వచ్చే సమయంలో నీటి మోటార్ను కరెంటులో ఉంచి మెయిన్ లైన్ నుంచి వాటర్‌ను తోడుతారు. అనంతరం మోటర్‌ను తీసివేసి మరలా సాయంత్రం ఇదే పనిని కొనసాగిస్తారు. ఈ క్రమంలో యధావిధిగా బుధవారం కూడా మంచినీరు వచ్చే సమయంలో మోటార్ను మెయిన్ పైప్ లైన్‌కు కనెక్ట్ చేసి వాటర్ పట్టుకోవడం అయిపోగానే తిరిగి మోటర్‌ను తీసేందుకు అశోక్ కుమార్ విద్యుత్ వైర్లను ఒక్కసారిగా లాగాడు దీంతో అతను ఒక్కసారిగా విద్యుత్‌ఘాతానికి గురై అక్కడే కుప్పకూలాడు.

తొమ్మిది కిలోల గంజాయి పట్టివేత

- ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-పామిడి (అనంతపురం)

గంజాయి వ్యాపారం చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి తొమ్మిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పామిడి మండలం పాల్యం గ్రామానికి చెందిన అన్నదమ్ములు తమ్మినేని శివకుమార్, తమ్మినేని నందకుమార్, గోపాలకృష్ణ, పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన అమర్నాథ్, అనంతపురం నందమూరి నగర్‌కు చెందిన పత్తిపాటి రవితేజ జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయాలను మొదలు పెట్టారు. గత 3 నెలల నుంచి వివిధ ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుక్కొని దానిని అనంతపురం, గుంతకల్లు పట్టణాల్లో కొత్త వ్యక్తులకు అమ్మకాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల గంజాయి వ్యాపారంలో భాగంగా విశాఖపట్నంలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. గంజాయిని తీసుకుని విశాఖపట్నం నుంచి తమ సొంత గ్రామమైన పామిడి మండలం పాల్యంకు తమ్మినేని శివకుమార్ కు చెందిన కారులో తరలించారు. అక్కడి నుండి బుధవారం ఉదయం పామిడి మండలం నీలూరు క్రాస్ దగ్గరలో నేషనల్ హైవే 44 రోడ్డు పక్కన కారులో గంజాయిని పెట్టుకుని కొనే వారికోసం ఎదురు చూస్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో సీఐ రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి లీలా వసుంధరతో కలిసి వారిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి తొమ్మిది కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని సిఐ తెలిపారు.

బోనమందలో ఏనుగుల గుంపు

- భయాందోళనలో గ్రామస్తులు, రైతులు

ప్రజాశక్తి- సోమల:

సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద గ్రామం సమీపంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో పెద్దఉప్పరపల్లి బోనమంద ప్రధాన రహదారిపై 15 ఏనుగుల గుంపు నడుస్తూ వస్తుండగా గుర్తించారు. మూడు, నాలుగు రోజులుగా ఇదే ప్రాంతంలో తిరుగుతున్నాయని ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

భద్రాద్రిలో జోరు వాన

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- జలదిగ్బంధంలో కొత్త కాలనీలోని 75 కుటుంబాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏకదాటిగా కురిసిన జోరువానతో భద్రాచలం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు రామాలయ దేవస్థాన పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. దాంతో వ్యాపారులకు తీవ్ర నష్టం జరిగింది. కొత్త కాలనీ, అయ్యప్ప కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీనికి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున నుంచి భద్రాచలం ఏజెన్సీ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గత వారం వరకు గోదావరి ప్రమాదకరస్థాయిలో ప్రవహించిన విషయం తెలిసిందే. అనంతరం గోదావరి ప్రవాహం తగ్గడంతో స్లూయిజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మోటర్లు తొలగించారు. బుధవారం కురిసిన వర్షంతో 23 ప్రాంతాల్లో ఇటు రెవెన్యూ అధికారులు గానీ, ఇరిగేషన్ అధికారులు గానీ పర్యటించకపోవడంతో స్థానిక ప్రజలు భయాందోళనలతో ఆర్తనాదనాలు చేశారు. అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో పాటు లాకుల వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చప్టా దిగువ రెడ్డి సత్రం వద్ద ఉన్న స్లూయిజ్, కొత్త కాలనీ, కరకట్ట వద్ద ఉన్న స్లూయిజ్‌ల వద్ద మోటార్లు లేక ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీటితో ఆయా ప్రాంతాలు జలమయమయ్యాయి. పునరావాస కేంద్రాల నుంచి సోమవారమే కొత్త కాలనీకి చెందిన 75 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి మరోసారి ఆ ప్రాంతం నీటిలో మునిగింది. ఇప్పటికే సర్వం కోల్పోయి ఇబ్బంది పడుతున్న కాలనీవాసులపై వర్షం ప్రతాపంతో మరింతగా చితికిపోయారు. అంతేకాక, రాజుపేట, జగదీష్ కాలనీ, ఎఎస్‌ఆర్ కాలనీల్లోని ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని కేకే ఫంక్షన్ ఎదురుగా డ్రెయినేజీ కాలువలో ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించడానికి వెళ్లిన ఓ వ్యక్తి కాలు జారిపడి గల్లంతయ్యాడు.

ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. చంద్రుగొండలో పాఠశాల గదుల్లోకి వర్షపు నీరు చేరింది. ఆళ్లపల్లి మండలం రాయిగూడెం గ్రామం వెళ్లే కిన్నెరసాని వాగుపై ఉన్న గ్రావెల్ కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వారావుపేట నుంచి వాగొడ్డుగూడెం రహదారిలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సత్తుపల్లి మండలం గంగారం నుంచి రామానగరం వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఉపాధి కార్మికుల వేతన వెతలు

- 10 వారాలుగా అందని కూలి
- రూ. 70 కోట్లకు పైగా పెండింగ్
- విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- పస్తులతో గడుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కిర్లంపూడి

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, ఇతర కార్మికుల జీవనోపాధికి ఉపాధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. వారి కుటుంబ పోషణ దీని ద్వారానే సాగుతోంది. అయితే అధికారులు పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయకపోవడం వలన అక్కరకు రాకుండా పోతోంది. పనులు చెప్పకపోవడంతో ప్రస్తుతం అరకొర మంది మాత్రమే పనుల్లోకి వెళుతుండగా పెండింగ్ వేతనాలు భారీగా పేరుకుపోయాయి. సుమారు 10 వారాలుగా కూలీ డబ్బులు అందని పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లనే సకాలంలో వేతనాలు అందడం లేదు. దాంతో పస్తులతో కాలం గడుపుతున్న పరిస్థితి ఏర్పడింది.

కిర్లంపూడి మండలంలో 2024 - 25 ఏడాదికి 13,828 జాబ్‌కార్డులను మంజూరు చేశారు. 21,694 మంది కార్మికులు ఉన్నారు. 10,722 జాబ్ కార్డుదారుల ద్వారా 15,055 మంది కూలీలు పని చేశారు. మొత్తం 2,07,756 పని దినాలను కల్పించారు. 41 కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని కల్పించారు. ఏప్రిల్ నెలలో కొన్ని రోజుల మినహా ఇప్పటి వరకు వేతనాలను విడుదల చేయలేదు. దాదాపు రూ.3కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇలా ఒక్కొక్క మండలంలో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకూ బకాయిలు పేరుకుపోయాయి.

రూ.79 కోట్లు పెండింగ్

కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామపంచాయతీలుండగా 2.74 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 4.48 లక్షల మంది కార్మికులు ఉన్నారు. వీరిలో రెగ్యులర్‌గా 3.15 లక్షల మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నందున నెల రోజుల నుంచి 8 వేలు నుంచి 15 వేల మంది మాత్రమే పని చేస్తున్నారు. మే నెల 20 నుంచి వేతనాలు అందడం లేదు. ఇలా ఒక్కొక్కరికి 10 వారాలుగా వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక కూలీ 6 రోజులూ పనికి వెళితే రోజుకి రూ.270-రూ.280 చొప్పున వారానికి రూ.1,680 నుంచి రూ.1,742 వరకూ కూలి వస్తుంది.

ఇలా జిల్లాలో ఒక్కొక్కరికి రూ.12 వేలు నుంచి రూ.15 వేలు వరకూ వేతనాలు అందాల్సి ఉంది. ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజనే అయినా కూలీలకు ఉపాధి లభించని పరిస్థితి నెలకొంది. జిల్లా మొత్తంగా రూ.70 కోట్లు పైనే వేతనాలు పెండింగ్లో ఉన్నాయని జిల్లా ద్వామా అధికారులు తెలిపారు. వ్యవసాయ పనులు నామమాత్రంగానే సాగుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో వందలాది మంది కూలీలు ఉపాధి హామీ పనుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే సీజన్ కావడంతోనే కార్మికులు పనులకు తక్కువగా వస్తున్నారని అధికారులు చెప్పు కొస్తున్నారు. వాస్తవానికి వారాల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండడంతోనే పనులకు వెళ్లేందుకు కార్మికులు వెనకడుగు వేస్తున్నారు. కార్మికుల కష్టార్జితానికి ఫలితం ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకుంది. దీంతో కూలి డబ్బులు రాక కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హజ్ యాత్రికుల వయోపరిమితి తగ్గింపు

న్యూఢిల్లీ: 2025 హజ్ పాలసీలో మోడీ ప్రభుత్వం వయోపరిమితిని తగ్గించింది. దీనిని 70 సంవత్సరాల నుంచి 65 ఏళ్లకు సడలించింది. ఈ చర్య వేలాది మంది వృద్ధాప్య యాత్రికులకు ప్రయోజనం చేకూరుస్తుందనీ, హజ్ యాత్రలో భాగంగా 65 ఏళ్ల, అంత కంటే ఎక్కువ వయస్సున్నవారికి ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కొత్త పాలసీ ప్రకారం సహచరుడి వయస్సు 18 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి. మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు గత నెలలో 2025 హజ్ విధానాన్ని సమీక్షించారు. ఆ తర్వాత ఈ మార్పు వచ్చింది. వచ్చే ఏడాది రిజిస్ట్రేషన్ సెప్టెంబర్ నుంచి ప్రారంభం కానున్నదని తెలుస్తున్నది. యాత్రికులకు సహాయం చేయటానికి, వసతి, విమానం, అత్యవసర హెల్ప్‌లైన్ గురించి సమాచారాన్ని అందించటానికి ప్రత్యేక 'హజ్ సువిధ' యాప్ ప్రారంభించబడింది. కొత్త విధానం ప్రకారం.. యాత్రికులు ప్రభుత్వ వైద్యుడి నుంచి మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందవలసి ఉంటుంది. గతేడాది పాలసీ ప్రకారం రిజిస్టర్డ్ డాక్టర్ నుంచి మెడికల్ సర్టిఫికేట్ పొందాల్సి ఉండేది.

ఆన్‌లైన్ మీడియాను నిషేధించేందుకు బిల్లు

- అనుమతి లేనిదే వీడియోలు, వార్తలు ప్రచురించరాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన స్రవంతి మీడియాను కొనుగోలు చేసిన బిజెపికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడుతున్న ఆన్‌లైన్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్‌లను కొత్త ప్రసార బిల్లు ద్వారా నిషేధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు, 1995 టెలివిజన్ నెట్‌వర్క్‌ల చట్టం స్థానంలో భావప్రకటనా స్వేచ్ఛ, ప్రభుత్వ విమర్శలను అరికట్టడానికి ప్రయత్నిస్తోంది. గతేడాది విడుదల చేసిన ముసాయిదా బిల్లుతో పోలిస్తే కొత్త బిల్లులోని నిబంధనలను సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కఠినతరం చేసింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన అన్ని సామాజిక మాధ్యమాల్లో వార్తలు, కరెంట్ అఫైర్స్ మొదలైనవి, ఆన్‌లైన్ పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లను ప్రదర్శించే వారిపై ఈ చర్య తీసుకోబడింది. ముసాయిదా బిల్లులో కంటెంట్ నిర్మాతలు 'డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్లు'గా నిర్వచించబడ్డారు.



కేంద్రం నియమించిన కమిటీ అనుమతి లేకుండా రూపొందించిన వీడియోలు, వార్తలను ప్రచురించరాదు. ఇందుకోసం మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. అనుచరుల సంఖ్య నిర్దిష్ట థ్రెషోల్డ్‌ను మించి ఉంటే కంటెంట్ సృష్టికర్తలు తప్పనిసరిగా ఒక నెలలోపు నమోదు చేసుకోవాలి. ప్రోగ్రామ్ కోడ్, అడ్వర్టైజింగ్ కోడ్‌కు అనుగుణంగా ఉండాలి.

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించడంలో ప్రధాన పాత్ర పోషించిన ఆన్‌లైన్ న్యూస్ ఛానెల్స్, వీడియో నిర్మాతలకు బ్యాక్ డోర్ నుంచి సంకెళ్లు వేస్తున్నారు. వార్తాపత్రిక ఆన్‌లైన్‌లో ఇచ్చినప్పటికీ వార్తాపత్రికలలో ముద్రించని వార్తలను కొత్త బిల్లులోని నిబంధనలు కఠినతరం చేస్తాయి.

ముంబాయి, మద్రాస్ హైకోర్టులు స్టే విధించిన ఐటి చట్టం-2021లోని 'కోడ్ ఆఫ్ ఎథిక్స్' విభాగానికి చట్టపరమైన చెల్లుబాటును కల్పించడం కూడా ముసాయిదా బిల్లు లక్ష్యం. స్టే అసమంజసమైనదని చెప్పే ఈ క్లాజ్ చట్టవిరుద్ధమని తేలింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో స్వతంత్ర మీడియా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతో ఈ చర్య తీసుకున్నట్లు మంత్రిత్వశాఖ వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి. ధృవ్ రాఠి, రవిష్ కుమార్ వంటి స్వతంత్ర ఆన్‌లైన్ జర్నలిస్టులు బిజెపి విధానాలను బహిర్గతం చేయడం ఉత్తర భారతదేశంలోని సామాన్య ప్రజల్లో బిజెపి వ్యతిరేక సెంటిమెంటును సృష్టించింది. ఇది ఎన్నికల్లోనూ ప్రతిఫలించింది. అందుకే మోడీ సర్కారు ఆన్‌లైన్ మీడియాపై కళ్లెం వేయాలని ప్రయత్నిస్తోంది.

కేజ్రీవాల్‌ను మళ్లీ అరెస్టు చేస్తారా?

- ఇడిని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను మరోసారి అరెస్టు చేస్తారా? అని ఇడిని ఢిల్లీ హైకోర్టు బుధవారం ప్రశ్నించింది. కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఇడి దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ప్రశ్న వేసింది. 'నాకు అంతా అయోమయంగా ఉంది. మీరు ఏమి చేయాలనుకుంటున్నారు? మీరు మళ్లీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారా?' అని విచారణలో జస్టిస్ నీనా బన్సల్ ప్రశ్నించారు. ఇడి నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు జూన్ 20న రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిపై హైకోర్టు స్టే ఇవ్వగా, సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పునకు కొన్ని గంటల ముందు సిబిఐ అరెస్టు చేయడంతో కేజ్రీవాల్ ఇంకా జైలులోనే ఉన్నారు. బుధవారం విచారణలో ఇడి తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపించాల్సి ఉంది. మరొక కేసులో రాజు బిజీగా ఉన్న కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరగా, విచారణను సెప్టెంబరు 5కి హైకోర్టు వాయిదా వేసింది.

మనీలాండరింగ్ తీర్పుపై 28న సమీక్ష



న్యూఢిల్లీ : మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఇడికి హద్దుల్లేని అధికారాన్ని కల్పించడాన్ని సమర్థిస్తూ 2022 జులైలో ఇచ్చిన తీర్పును సమీక్షించడానికి సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. ఆగస్టు 28న సమీక్ష నిర్వహించడానికి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం షెడ్యూల్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై అప్పీల్‌ను బహిరంగ కోర్టులో సమీక్షించకూడదని జస్టిస్ సిటి రవికుమార్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం సూచించింది. తీర్పులో 'తీవ్రమైన తప్పు' ఉన్నా అప్పీల్‌లో రివ్యూ ప్రొసీడింగ్స్‌కు చోటు లేదని ధర్మాసనం తెలిపింది. ఈ నెల 28న చేసే సమీక్ష కోర్టు తీర్పుపై అప్పీల్ చేయడం కాదని, తీర్పులో ఏమైనా తీవ్రమైన లోపాలు ఉంటే గుర్తించడానికే అని ధర్మాసనం స్పష్టం చేసింది. 2022 జులైలో ఇచ్చిన తీర్పును సమీక్షించాలని పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, ఎంఎం సింఘ్వీ, మేనకా గురుస్వామి ధర్మాసనాన్ని కోరారు. ఇడికి పిఎంఎల్ఎ కింద లభించిన హద్దుల్లేని అధికారాన్ని సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునే భారాన్ని నిందితుడి భుజాలపైకే నెట్టేశారని పిటీషన్‌దారులు పేర్కొన్నారు. మనీలాండరింగ్ చట్టంలో చేసిన సవరణలతో ఎలాంటి వ్యక్తులనైనా అరెస్టు చేయడానికి, విచారించడానికి, ప్రైవేటు ఆస్తులపై దాడి చేయడానికి ఇడికి హక్కులు కల్పించినట్లయిందని తెలిపారు. ఈ చట్టం కింద అరెస్టయిన సందర్భంలో బెయిల్ కోసం విధించిన వివాదాస్పద జంట షరతులను సమర్థించడాన్ని పిటీషన్‌దారులు ప్రశ్నించారు. పిఎంఎల్ఎ చట్టం 2002కు 2019లో ఫైనాన్స్ యాక్ట్ ద్వారా చేసిన సవరణలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఈ సవరణలకు వ్యతిరేకంగా 240కి పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. 'విచారణ ప్రక్రియే శిక్ష' అని పిటీషన్లు పేర్కొన్నాయి. 2022 జులై 27న ఈ సవరణలను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

గల్లంతైన వారి ఆచూకీ కనుగొంటాం : కేరళ మంత్రి

తిరువనంతపురం : వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ప్రమాదానికి సంబంధించిన గాలింపు, సహాయ కార్యక్రమాలు 10వ రోజైన బుధవారం కూడా కొనసాగాయి. గాలింపు కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయని, గల్లంతైన వారి ఆచూకీ కనుగొనడాన్ని గురువారం నాటికి పూర్తి చేస్తామని రెవెన్యూ మంత్రి కె.రాజన్ బుధవారం ప్రకటించారు. బుధవారం గాలింపుల్లో ఒక మృతదేహం, శరీర భాగాలు లభ్యమయ్యాయని చెప్పారు. ప్రస్తుతం 16 సహాయ శిబిరాల్లో 2,199 మంది ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. శిబిరాల్లో వున్న ప్రతి ఒక్కరికీ రోజూ కౌన్సెలింగ్ జరుగుతోందని, ఇందుకోసం అత్యుత్తమ మానసిక ఆరోగ్య నిపుణుల సేవలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. కొండచరియలు విరిగిపడి నివాసాలు కోల్పోయిన వారందరికీ సమగ్ర పునరావాసం కల్పిస్తామన్నారు. మొత్తం 16 పునరావాస శిబిరాలను నలుగురు మంత్రులు, వయనాడ్ జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారులు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారని కె రాజన్ మీడియాకు తెలిపారు.కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. ప్రతిపక్ష నేత విడి సతీశన్ రూ.లక్ష అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి జులై 30 నుంచి ఈ నెల 5 వరకూ రూ.53.98 కోట్లు విరాళంగా అందిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. జూలై 30 నుంచి సిఎం సహాయనిధికి వచ్చే ప్రతి రూపాయిని వయనాడ్‌లో సహాయ కార్యక్రమాలకే వినియోగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.సహాయనిధికి అందిన విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. 2018 ఆగస్టు నుంచి అందుకున్న మొత్తం, ఈ ఏడాది జూలై 30 నుంచి ప్రతి రోజు అందుకున్న మొత్తం వేర్వేరుగా నమోదు చేయబడ్డాయి. చెక్/డ్రాఫ్ట్/డైరెక్ట్ డెబిట్ వివరాలు కూడా త్వరలో వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయబడతాయని అధికారులు తెలిపారు.



పాలసీదారులు, నామినీల మరణంతో
కష్టంగా మారిన బీమా క్లెయిమ్‌లు

తిరువనంతపురం : వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో కొందరు జీవిత బీమా పాలసీదారులు, వారి నామినీలు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ పాలసీలను క్లెయిమ్ చేయడం జీవిత బీమా అధికారులకు కష్టంగా మారింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) కల్‌పేట్ట శాఖకు చెందిన అధికారులు తన కస్టమర్ల జాబితాను పరిశీలించినప్పుడు ఈ విషయం వెల్లడైంది. కొన్ని పాలసీ కేసుల్లో బీమా చేసిన వారు, వారి నామినీలు ఇద్దరూ చనిపోయినట్లు గుర్తించామని, పాలసీ మెచ్యూర్ కావడానికి ముందే బీమా చేసిన వారు, నామినీలు మరణించడం చాలా అసాధారణమైన విషయమని అధికారులు తెలిపారు. వాయనాడ్ ప్రమాదం కారణంగానే ఈ విధంగా జరిగిందని చెప్పారు. సాధారణంగా పాలసీదారులు మరణిస్తే పాలసీ మెచ్యూరిటీ పూర్తయిన తరువాత పాలసీలో హామీ ఇచ్చిన విధంగా నగదును నామినీలకు అందజేస్తామని ఎల్‌ఐసి అధికారులు తెలిపారు. పాలసీదారులు, నామినీలు ఇద్దరూ మరణిస్తే ప్రస్తుత చట్టాల ప్రకారం పాలసీకి రెండు తరగతులు వారు హక్కుదారులు అవుతారని అధికారులు చెప్పారు. రెండు తరగతుల్లో ఒక తరగతిలో పాలసీదారులకు జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, సంతానం ఉంటారని చెప్పారు. మరొక తరగతిలో ఇతర కుటుంబ సభ్యులు ఉంటారని చెప్పారు. ఈ విధంగా హక్కుదారులను గుర్తించడం చాలా క్లిష్టమైన ప్రక్రియ అని ఎల్‌ఐసి అధికారులు తెలిపారు. పాలసీదారుల వారసులను గుర్తించడానికి చట్టాలున్నా, వివిధ మతాలకు వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. ఒకవేళ గుర్తించినా బీమా మొత్తాన్ని చట్టబద్ధమైన వారసులకు క్లెయిమ్ చేయడం అంత తేలికమైన పని కాదని, చట్టపరమైన మిగిలిన వారసులందరూ అందుకు అనుమతిస్తూ అఫిడవిట్‌పై సంతకం చేయాలని అధికారులు చెప్పారు.

గ్లోబల్ ఎకనామిక్ సూపర్‌పవర్ అంటే ఇదేనా ..!

లక్నో : 'గ్లోబల్ ఎకనామిక్ సూపర్‌పవర్'గా అవతరించడం వల్ల ఉద్యోగులకు బకాయిలు రావడం లేదని సమాజ్ వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఎద్దేవా చేశారు. పెరుగుతూపోతున్న జిఎస్‌టి వసూళ్ల నగదు అంతా ఎక్కడి నుంచి వస్తుందో చెప్పాలని మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 18 నెలల కరువు భత్యం (డిఎ)ను చెల్లించేందుకు మోడీ ప్రభుత్వం తిరస్కరించిన సంగతి తెలిసిందే. గ్లోబల్ ఎకనామిక్ సూపర్ పవర్‌గా అవతరించిందని మోడీ ప్రభుత్వం ప్రకటించడం వల్లే ఉద్యోగులకు బకాయిలు అందడం లేదా? అని ఆయన ఎక్స్‌లో బుధవారం పోస్ట్ చేశారు. వారి బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం నిరాకరించడం, ఓ విధంగా ప్రభుత్వ హామీని తిరస్కరించడమేనని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ప్రకటనకు సంబంధించి వార్తాపత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్‌లను కూడా జత చేశారు. జిఎస్‌టి వసూళు ఎక్కడి నుండి వస్తున్నాయో చెప్పాలి. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కొనసాగుతుందా ? వేల కోట్ల విలువైన ఓడలకు, లీకేజీ భవనాలకు డబ్బు ఉంది కానీ అసలు ప్రభుత్వాన్ని నడిపించే ఉద్యోగులకు జీతాలిచ్చేందుకు లేదు. ఓ వైపు ద్రవ్యోల్బణం, మరోవైపు కరువు భత్యం లభించకపోవడంతో పరిమిత ఆదాయం కలిగిన ఉద్యోగులపై రెట్టింపు దెబ్బ అని పేర్కొన్నారు.చెల్లింపులు సరిగా లేకపోతే ఉద్యోగుల సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. పనిచేసే వారికి బిజెపి సరైన జీతం ఇవ్వడం లేదని, వైద్య ఖర్చులు పెరుగుతున్నా పింఛన్ ఇవ్వడం లేదని, వృద్ధులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వివరించారు.ఇప్పుడు ప్రభుత్వం పెన్షన్ కోసం సీనియర్ సిటిజన్లు నిరాహారదీక్ష చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోందా? అని ప్రశ్నించారు. రైల్వే రాయితీలను నిలిపివేయడం ద్వారా సీనియర్ సిటిజన్‌లను అవమానించిందని విమర్శించారు.



గుజరాత్‌లో ఆకలి కేకలు

- గర్భిణుల్లో రక్తహీనత... చిన్నారుల్లో పోషక లోపాలు
- నీతి ఆయోగ్ నివేదిక

అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ ఇలాకా గుజరాత్ ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్నా.. ఆకలితో అలమటిస్తోందని నీతి ఆయోగ్ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఆకలిలో పోరాడే విషయంలోనూ, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలోనూ ఆ రాష్ట్రం వెనుకబడి ఉన్నదని ఈ నెల ప్రారంభంలో నీతి ఆయోగ్ విడుదల చేసిన 2023-24 సంవత్సరపు సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్‌డిజి) నివేదిక తెలిపింది. దీని ప్రకారం ఆకలికి సంబంధించిన సూచికలో గుజరాత్ 25వ స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో ఐదు సంవత్సరాల లోపు వయసున్న చిన్నారుల్లో 39.7 శాతం మంది పోషకాహార లోపం కారణంగా తక్కువ బరువుతో బాధపడుతున్నారు.

ఆకలితో ఎవరూ అలమటించకూడదని ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2015లో ఐరాస మొత్తం 17 లక్ష్యాలను పెట్టుకుంది. ఆకలికి సంబంధించిన సూచికలో గుజరాత్ కేవలం 41 పాయింట్లు మాత్రమే సాధించింది. ఆకలితో పోరాడే విషయంలో ఒడిషా, మధ్యప్రదేశ్, మరో 23 రాష్ట్రాల కంటే వెనుకబడి పోయింది. ఆకలి సూచికలో గుజరాత్ 2020-21లో 46 పాయింట్లు సాధించగా, 2019-20లో 41 పాయింట్లు పొందింది. 2018లో 49 పాయింట్లు సాధించింది. ఆకలిపై పోరు విషయంలో గుజరాత్ బాగా వెనుకబడి పోతోందని దీనిని బట్టి అర్థమవుతోంది.

ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లల్లో 39 శాతం మంది కుంగుబాటుకు గురవుతున్నారని, 15-49 సంవత్సరాల మధ్య వయసున్న గర్భిణుల్లో 62.5 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, అదే వయసున్న మహిళల్లో 25.2 శాతం మందిలో బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) 18.5 కంటే తక్కువగా ఉన్నదని నీతి ఆయోగ్ నివేదిక చెబుతోంది. 2018, 2019తో పోలిస్తే కుంగుబాటుకు గురవుతున్న పిల్లలు, రక్తహీనతతో బాధపడుతున్న మహిళల సంఖ్య పెరిగింది.

'గుజరాత్‌కు సంబంధించిన ఆకలి సూచిక 2020-21లో 46 పాయింట్లు ఉంటే 2023-24లో 41 పాయింట్లకు పడిపోయింది. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో 39.7 శాతం మంది తక్కువ బరువుతో బాధపడుతున్నారు. గర్భిణుల్లో 62.5 శాతం మంది రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 2030 నాటికి ఆకలిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే విషయంపై తక్షణమే దృష్టి సారించాలి. అందుకు అవసరమైన పెట్టుబడులు పెట్టాలి' అని అహ్మదాబాద్‌కు చెందిన విద్యావేత్త ఆత్మన్ షా సూచించారు. 2023వ సంవత్సరానికి సంబంధించి దేశంలో పేదరికంపై నిటి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం గుజరాత్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న జనాభాలో దాదాపు సగం మందికి (44.45 శాతం), పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో 28.97 శాతం మందికి పోషకాహారం లభించడం లేదు.



వయనాడ్ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- లోక్‌సభలో రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన విపత్తుపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, పరిహారం పెంచాలని, సమగ్ర పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జీరో అవర్‌లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. వయనాడ్ విపత్తు అంశాన్ని ప్రస్తావించారు. వయనాడ్‌లో బాధితులను ఆదుకునేందుకు వివిధ వర్గాల వారు ముందుకురావడం హర్షణీయమన్నారు. ఇటీవల తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో పర్యటించామన్నారు. భయంకరమైన విధ్వంసాన్ని, జనాల బాధలను కళ్లారా చూశానన్నారు. కొండచరియలు విరిగిపడి రెండు కిలోమీటర్ల వరకు రాళ్ల కుప్పలు ఉన్నాయన్నారు. విపత్తులో 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని.. పెద్ద సంఖ్యలో జనం గల్లంతయ్యారన్నారు. సంఘటనా స్థలంలో సేవలందిస్తున్న రెస్క్యూ సిబ్బందిని అభినందించారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు అందిస్తున్న సహాయాన్ని సైతం ప్రశంసించారు. కొండచరియలు విరిగిపడడంతో ప్రధాన రహదారి తెగిపోయిందని, దాంతో ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడంలో రెస్క్యూ బృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయన్నారు. ఈ విపత్తులో చాలా సందర్భాలలో కుటుంబంలోని ఒక సభ్యుడు మాత్రమే ప్రాణాలతో బయటపడటం చాలా బాధాకరమన్నారు.

ఫొగాట్‌పై అనర్హతను నిరసిస్తూ వాకౌట్

- పార్లమెంట్ ముఖద్వారం వద్ద ఆందోళన
- ఆమె అనర్హత వెనుక కుట్ర
- ఒలింపిక్స్ కమిటీతో సంప్రదింపులు జరపాలి
- వినేష్ ఫొగాట్‌కు న్యాయం చేయాలి
- ప్రతిపక్షాలు డిమాండ్



పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పారిస్ ఒలింపిక్‌లో రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటుపై ప్రతిపక్షాలు పార్లమెంట్ ఉభయ సభల నుంచి వాకౌట్ చేశాయి. వినేశ్‌పై అనర్హత చట్టబద్ధమేనని లోక్‌సభలో క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవ్య చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆమె అనర్హత వెనుక ఏదో కుట్ర ఉందని ప్రతిపక్షాలు అనుమానం వ్యక్తం చేశాయి. ఒలింపిక్స్ కమిటీతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశాయి. ఇండియా ఫోరం పార్టీల ఎంపిలంతా పార్లమెంట్ మకర ద్వారం వద్ద ఆందోళన చేపట్టాయి.

లోక్‌సభ ప్రారంభం కాగానే వినేశ్‌పై అనర్హత అంశాన్ని చర్చించాలంటూ ప్రతిపక్ష ఎంపిలు పట్టుబట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర క్రీడా మంత్రి ప్రకటన చేస్తారని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రకటన చేశారు. 'ఈ రోజు వినేశ్ బరువు 50 కిలోల 100 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. దీంతో రెజ్లర్ అనర్హతకు గురయ్యారు. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద భారత ఒలింపిక్ సంఘం తీవ్ర నిరసన తెలియజేసింది. ఐఒఎ అధ్యక్షురాలు పిటి ఉష ప్రస్తుతం పారిస్‌లోనే ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐఒఎ అధ్యక్షురాలితో మాట్లాడారు. ఈ అంశంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారు. వినేష్ కోసం కేంద్రం అన్ని రకాల సాయాన్ని అందించింది' అని పేర్కొన్నారు. ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ ఫైనల్స్‌కు చేరిన తొలి భారతీయ మహిళ వినేశ్ ఫొగాట్ అని, వ్యక్తిగత సిబ్బందితో సహా వినేశ్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని ప్రభుత్వం అందించిందని తెలిపారు. అప్పీలు దాఖలు చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫైనల్స్‌కు చేరుకున్నప్పటికీ వినేశ్‌ను అభినందించడానికి సిద్ధపడని ప్రధాని నరేంద్ర మోడీ, ఆమెపై అనర్హత వేటు పడిన తరువాత ఎక్స్‌లో ఆమెకు ధైర్యం చెబుతూ పోస్ట్ చేశారు. బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులపై వినేశ్ సహా రెజ్లర్లు ఢిల్లీలో ఆందోళన చేసినా నేటికీ ఆ అంశంపై స్పందించకపోగా, అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

దర్యాప్తునకు అఖిలేశ్ డిమాండ్

వినేశ్ పై అనర్హత అంశంలో దర్యాప్తు చేపట్టాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలైన కారణం బయటకు రావాలంటూ తన ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్‌లో అఖిలేష్ యాదవ్ పోస్టు చేశారు.

కుట్రపై న్యాయమైన విచారణ అవసరం
ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్
దేశవ్యాప్త నిరసనలకు పిలుపు

పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ను ఏకపక్షంగా అనర్హురాలుగా ప్రకటించడాన్ని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండించాయి. ఈ అంశంపై గురువారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. అనర్హత చుట్టూ ఉన్న మిస్టరీ భారీ కుట్రకు దారితీస్తోందని పేర్కొంటూ, క్రీడా మంత్రిత్వ శాఖ, రెజ్లింగ్ సమాఖ్య, సిబ్బంది పాత్రపై న్యాయమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. వినేశ్‌పై అనర్హత వేటు కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలపై కఠోరమైన దాడి అని పేర్కొన్నాయి. సహాయక సిబ్బంది, కోచ్‌తో వినేష్ తన అసంతృప్తి వ్యక్తం చేశారని, వినేష్ సన్నిహితులను కూడా తిరస్కరించడంతో ఫెడరేషన్ పాత్రపై ప్రశ్నలను లేవనెత్తుతుందని తెలిపాయి. క్వాలిఫయర్స్‌కు ముందు కోచ్‌ల గురించి కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నాయి. వినేశ్‌పై అనర్హత వేటు వేయడంతో దేశానికి అన్యాయం జరగడమే కాకుండా, దేశ క్రీడా వ్యవస్థపై నమ్మకం ఉంచిన కోట్లాది మంది ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమేనని స్పష్టం చేశాయి. వినేశ్‌కు సంఘీభావం తెలిపాయి. డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎఎ రహీం (ఎంపి), ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు విపి సాను, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్‌లు గురువారం దేశవ్యాప్త నిరసనలు నిర్వహించాలని సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు.

కేరళ కోసం ఆలోచించండి

- జిడిపిలో కార్పొరేట్ సహకారం పెరగలేదు
- వారి లాభాలు మాత్రం 4 రెట్లు పెరిగాయి
- రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ కోసం ఆలోచించాలని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ కోరారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బిజెపి ఘోర పరాజయం పాలైన తరువాత కేంద్రం ప్రజలకు అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని అందరూ అనుకున్నా అలా చేయలేదని అన్నారు. సామాన్య ప్రజల కంటే, కార్పొరేట్ల కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. 2018-19లో జిడిపికి కార్పొరేట్ పన్ను సహకారం 3.5 శాతం ఉందని, అయితే ఇప్పుడు కార్పొరేట్ లాభాలు నాలుగు రెట్లు పెరిగినప్పటికీ, జిడిపిలో వారి సహకారం 3.1 శాతానికి పడిపోయిందని అన్నారు. ఆదాయపు పన్ను పెరిగిందని, 2018-19లో జిడిపికి దాని సహకారం 2.4 శాతంగా ఉందని, ఇప్పుడు 2.6 శాతానికి పెరిగిందని ఆయన చెప్పారు. ధరల పెరుగుదల ఎలా ఉంటుందో, పెరుగుతున్న జీవన వ్యయాలు ఎలా ఉన్నాయో స్పష్టం అవుతుందని అన్నారు. నిరుద్యోగం ఎక్కువగా ఉందని కూడా ఆయన ఎత్తిచూపారు. కేరళ కొంత పరిశీలన కోసం చూస్తోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కేరళ గురించి అవమానకరంగా మాట్లాడారని అన్నారు. సురేష్ గోపి (కేరళకు చెందిన కేంద్ర మంత్రి)తో సహా కేరళీయులందరినీ అవమానిస్తున్నారని, దయచేసి రాజకీయ నింద ఆటలో మునిగిపోకండని మంత్రులకు హితవు పలికారు. ఇది వయనాడ్ అభాగ్యుల కోసం ఐక్యతను ప్రదర్శించాల్సిన సమయమని ఆయన అన్నారు. అన్ని సర్ ఛార్జీలు, సుంకాలు రాష్ట్రాలు, కేంద్రానికి వచ్చే ఆదాయంగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు, కేరళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇంధనంపై రాష్ట్రాల పన్నులు పెంచాలి : నిర్మలా సీతారామన్

ఇంధనంపై రాష్ట్రాల పన్నులను పెంచాలని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. పెట్రోలు, డీజిల్‌పై పన్నులు తగ్గించే ఉద్దేశం లేకపోవడంపై జరిగిన చర్చకు ఆమె స్పందిస్తూ.. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లలో పన్నులు పెంచిన సందర్భాలను ఎత్తి చూపారు. ప్రతిపక్షాల సభ్యులు తమ రాష్ట్రాల్లో చర్చకు అనుగుణంగా నడుచుకోవడం లేదని కేంద్ర మంత్రి వాదించారు. ఆరోగ్యంపై జిఎస్‌టి నుంచి వసూలు చేసిన 18 శాతం ప్రీమియంలో ఒక్కోదానికి 9 శాతం సమాన వాటా రాష్ట్రాలు, కేంద్రానికి వస్తుందని తెలిపారు.

కోచింగ్ సెంటర్ ఘటపై సిబిఐ విచారణ

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్ర నగర్ ప్రాంతంలోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో ముగ్గురు సివిల్ సర్వీసెస్ అభ్యర్థులు మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సిబిఐ విచారణ చేపట్టింది. మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసిడి) అధికారులపై చర్య తీసుకోవటంలో విఫలమైనందుకు ఢిల్లీ హైకోర్టు అక్కడి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత సిబిఐ మంగళవారం ఆలస్యంగా ఈ విషయంలో కేసును తిరిగి నమోదు చేసింది. ఈ అంశంపై గతవారం సిబిఐ విచారణకు ఆదేశిస్తూ.. నగరంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో ఢిల్లీ ప్రభుత్వం అసమర్థతపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్, న్యాయమూర్తి తుషార్ రావు గెడెలతో కూడిన ధర్మాసనం సంఘటన స్వభావాన్ని బట్టి దర్యాప్తుపై ప్రజలకు అనుమానం రాకుండా చూసేందుకు విచారణను బదిలీ చేసింది. గతనెల 27న స్థానికంగా కురిసిన భారీ వర్షాల కారణంగా రౌస్ ఐఎఎస్ స్టడీ సర్కిల్ కోచింగ్ సెంటర్‌లోని బేస్‌మెంట్ లైబ్రరీ వరదల్లో మునిగిపోవడంతో తాన్యా సోని(21), శ్రేయా యాదవ్(25), నెవిన్ డెల్విన్(29) మునిగిపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటన కలకలం సృష్టించిన విషయం విదితమే. ఈ ఘటన కోచింగ్ సెంటర్ వెలుపల నిరసనలకు దారితీసింది. పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బంగ్లాదేశ్‌లో రాజీనామాల పర్వం

అటార్నీ జనరల్, బంగ్లాదేశ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ సహా పలువురు రాజీనామా

ఢాకా : బంగ్లాదేశ్‌లో అనిశ్చితి నెలకొనడంతో అటార్నీ జనరల్ అడ్వకేట్ అబు మహ్మద్ అమీన్ ఉద్దీన్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయనను అక్టోబర్ 2020లో న్యాయమంత్రిత్వశాఖ అటార్నీ జనరల్‌గా నియమించింది. ఆయన బంగ్లాదేశ్ 16వ అటార్నీ జనరల్‌గా పనిచేశారు. అమీన్ ఉద్దీన్ గతంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా కూడా పనిచేశారు.

బంగ్లాదేశ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ ఖాజీ సయేదుర్ రెహమాన్ సహా ఆరుగురు ప్రధాన అధికారులు బుధవారం రాజీనామా చేశారు. ఉన్నతాధికారుల అవినీతిపై నిరసన వ్యక్తం చేస్తూ దాదాపు 300 నుండి 400మంది సిబ్బంది ఆందోళనకు దిగడంతో వారు రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. డిప్యూటీ గవర్నర్లు నూరున్ నహర్, ఎమ్‌డి ఖుర్షీద్ ఆలం, ఎమ్‌డి హబీబుర్ రెహమాన్‌లను ఖాళీ కాగితాలపై సంతకం చేయాలని ఒత్తిడి చేశారు. అనంతరం బ్యాంక్ సలహాదారు అబు ఫరా నాసర్, బంగ్లాదేశ్ ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (బిఎఫ్ఐయు) హెడ్ మసూద్ బిస్వాస్‌లను కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. వీరంతా కాంట్రాక్ట్ ప్రాతిపదికన బంగ్లాదేశ్ బ్యాంకులో నియమితులయ్యారు. తనను ప్రభుత్వం నియమించిందని, ప్రభుత్వం ఆదేశిస్తే తాను రాజీనామా చేస్తానని, లేదా తొలగించినా ఆమోదమేనని డిప్యూటీ గవర్నర్ కాజీ సయేదుర్ రెహమాన్ పేర్కొన్నారు. ఈ విధంగా రాజీనామా చేయాలంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడి చేయడం సమంజసం కాదని తెలిపారు.

షేక్ హసీనా సోమవారం దేశాన్ని విడిచి వెళ్లిన తర్వాత మరో గవర్నర్ అబ్దుర్ రూఫ్ తాలూక్దర్ బ్యాంకుకు హాజరుకాలేదు. హసీనాకు స్నేహితులుగా ఉన్నవారంతా రాజీనామా చేయాల్సిందేనని బుధవారం సెంట్రల్ బ్యాంక్



సాధారణ స్థితికి చేరుకుంటున్న ఢాకా

అధికారులు డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిపై మానవ వనరుల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్పందించలేదని స్థానిక మీడియా తెలిపింది.

యువతే మన భవిష్యత్తు : ఖలీదా జియా

దేశ పునర్నిర్మాణానికి కావాల్సింది శాంతి, ప్రేమలని, అంతేకానీ ఆగ్రహం లేదా ప్రతీకారం కాదని బిఎన్‌పి ఛైర్‌పర్సన్ ఖలీదా జియా వ్యాఖ్యానించారు. గృహ నిర్బంధం నుండి విడుదలైన ఒక రోజు తర్వాత ఆమె దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అసాధ్యమనుకున్నదాన్ని సుసాధ్యం చేయడానికి పోరాడిన వారిని అభినందించారు. ఢాకాలోని నయాపల్టాన్‌లో బుధవారం జరిగిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ర్యాలీలో ఆమె ప్రసంగించారు. యువతే మన భవిష్యత్తు. వారి కలలను సాకారం చేసేందుకు ప్రజాస్వామిక బంగ్లాదేశ్‌ను నిర్మించాల్సిన అవసరం వుందని అన్నారు. 'విధ్వంసం, ఆగ్రహం, ప్రతీకారం వద్దు, మనకు ప్రేమ, శాంతి అవసరం, వాటితోనే దేశాన్ని పునర్నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు. మూడు మాసాల్లోగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాల్సిందిగా బిఎన్‌పి సెక్రటరీ జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లామ్ ఆలంగిర్ డిమాండ్ చేశారు.

ఇదిలావుండగా, 20రోజుల సుదీర్ఘ విరామం అనంతరం జహంగీర్ నగర్ యూనివర్శిటీ బుధవారం పున: ప్రారంభమైంది. వచ్చే ఆదివారం నుండి తరగతులన్నీ జరుగుతాయని, పరీక్షలు నిర్వహించబడతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

మరికొన్ని రోజులు హసీనా ఢిల్లీలోనే

షేక్ హసీనా మరికొన్ని రోజులు ఢిల్లీలోనే వుంటారని ఆమె కుమారుడు సాజీబ్ వజీద్ బుధవారం తెలిపారు. మరో దేశంలో ఆశ్రయం కోరేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని వచ్చిన వార్తలు కేవలం వదంతులేనని చెప్పారు. ఆమె ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. ఆమె ఒంటరిగా లేరని,తన సోదరి ఆమెతోనే వున్నారని చెప్పారు.

పారిపోయిన 209 మంది ఖైదీలు

మంగళవారం నాడు మధ్యాహ్నం జైలు బయట జరుగుతున్న ప్రదర్శనను అవకాశంగా తీసుకుని గాజిపూర్‌లోని అత్యంత భద్రత వుండే కషింపూర్ జైలు నుండి 209మంది ఖైదీలు తప్పించుకుని పారిపోయారు. ఖైదీలు పారిపోకుండా నివారించేందుకు జైలు అధికారులు కాల్పులు జరిపారు. ఫలితంగా ఆరుగురు ఖైదీలు మరణించారు. కొంతమంది ఖైదీలు ఒక గార్డును తమ అదుపులోకి తీసుకుని మిగిలిన ఖైదీల విడుదల కోసం డిమాండ్ చేశారని స్థానిక వర్గాలుతెలిపాయి.

భారత్‌లోకి ప్రవేశించేందుకు యత్నాలు

బంగ్లాదేశ్‌లో సంక్షుభిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అనేకమంది బంగ్లా పౌరులు భారత్ భూభాగంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని బిఎస్ఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఉత్తర బెంగాల్ పొడవునా అంతర్జాతీయ సహరిద్దులో వివిధ ప్రాంతాల్లో బంగ్లాదేశ్ జాతీయులు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నారని ఆ అధికారి తెలిపారు. బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్, పౌర యంత్రాంగం, బిఎస్ఎఫ్ సిబ్బంది సాయంతో వారిని అక్కడ నుండి చెదరగొట్టినట్లు చెప్పారు.

పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దు పొడవునా గల పరిస్థితులను బిఎస్ఎఫ్ సమీక్షించింది. హై అలర్ట్‌ను ప్రకటించారు. రెండు దేశాల మధ్య అంతర్జాతీయ సరిహద్దు 4వేల కిలోమీటర్ల పైనే వుంది. అస్సాంలోకి చొరబాట్లు పెరుగుతాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో త్వరగా పరిస్థితులు చక్కబడి, సాధారణ స్థితికి రాగలవని పాకిస్తాన్ ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లా ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించింది.

నిరసన హత్యలపై దర్యాప్తు

గత నెల రోజులుగా సాగిన నిరసనలు, ఆందోళనల సమయంలో జరిగిన హత్యలు, సంభవించిన హింస, ఘర్షణలపై దర్యాప్తు జరుపుతామని బంగ్లాదేశ్ కొత్త పోలీసు చీఫ్ హామీ ఇచ్చారు. ఈ హత్యలపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు, సామాన్యులు, పోలీసులు ఇలా ఇటీవల కాలంలో ఎవరు మరణించినా వాటన్నింటిపై విచారణ చేపడతామన్నారు.

అవామీ లీగ్ సభ్యులే లక్ష్యంగా దాడులు

పాలక పార్టీ అవామీ లీగ్‌కి చెందిన నేతలు, సభ్యులనే లక్ష్యంగా చేసుకుని బంగ్లాదేశ్‌లో గత రెండు రోజులుగా దాడులు జరుగుతున్నాయి. హసీనా పార్టీ సభ్యులని తెలిస్తే చాలు వారిని వెంటాడి, వేధించి మరీ హత్యలు చేశారు. అల్లరి మూకల దాడుల్లో ఇప్పటివరకు చనిపోయిన 29 మంది మృతదేహాలను కనుగొన్నారు.

వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన నిర్దిష్ట నిబంధనలు, వక్ఫ్ పోర్టల్, డేటాబేస్‌ల వివరాల నమోదు, వక్ఫ్ తప్పుడు డిక్లరేషన్లకు సంబంధించి 3ఎ, 3బి, 3సిలను చేర్చాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

వక్ఫ్ చట్టంలో మార్పులను సహించం
ముస్లిం సంస్థలు, ప్రతిపక్షాలు

వక్ఫ్ చట్టం సవరణకు కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లు ఆమోదయోగ్యం కాదని ముస్లిం పర్సనల్ లా బోర్డు, పలు ముస్లిం సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు పేర్కొన్నాయి. ముస్లిముల మతపరమైన, విద్యాపరమైన ధార్మిక కార్యక్రమాల నిమిత్తం ఇచ్చిన విరాళాలని, వాటిని నియంత్రించేందుకే ప్రభుత్వం వక్ఫ్ చట్టం రూపొందించిందని ముస్లిం పర్సనల్ లా బోర్డు పేర్కొంది. వక్ఫ్ చట్టానికి, వక్ఫ్ ఆస్తులకు భారత రాజ్యాంగం, షరియత్ అప్లికేషన్ చట్టం 1937 ప్రకారం రక్షణ ఉందని, కాబట్టి ఆస్తుల స్వభావాన్ని, స్థితిని మార్చే ఏ సవరణ చేసే హక్కు ప్రభుత్వానికి లేదని తెలిపింది. పార్లమెంటులో అలాంటి చర్యలను తిరస్కరించాలని ఎన్‌డిఎ పక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేసింది. వక్ఫ్ బోర్డు అధికారాలను హరించే కేంద్రప్రభుత్వ చర్యను తమ పార్టీ వ్యతిరేకిస్తుందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఈ చర్య పార్లమెంటరీ విధానాలకు ముప్పు తెస్తుందని కాంగ్రెస్ నేత నసీమ్‌ఖాన్ పేర్కొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయండి

- ఎస్‌సి జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించాలి
- ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి
- కేంద్ర మంత్రికి ఎఐఎడబ్ల్యుయు బృందం వినతి



మంత్రికి వినతిని అందిస్తున్న ఎఐఎడబ్ల్యుయు నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌ను ఎఐఎడబ్ల్యుయు నేతలు బి వెంకట్, వి శివదాసన్ (రాజ్యసభ ఎంపి), విక్రమ్ సింగ్‌తో కూడిన బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్‌లను ప్రవేశపెట్టాని డిమాండ్ చేశారు. దేశంలోని షెడ్యూల్డ్ కులాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల జనాభా శాతానికి తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి సరైన కేటాయింపులు, నిధుల వినియోగం ఉండేలా సబ్‌ప్లాన్ చట్టాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి వర్గాల భాగస్వామ్యం, సాధికారతను మెరుగుపరచడానికి విద్యా, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో షెడ్యూల్డ్ కులాలకు తగిన వనరులుండేలా చూసుకోవాలని కోరారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ల రాజ్యాంగ రక్షణను అనుసరించాలని డిమాండ్ చేశారు. దళితులపై అఘాయిత్యాలను నిరోధించడానికి ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని స్ఫూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమిలేని వారికి భూమిని పంపిణీ చేయాలని, అందరికీ ఇళ్లు ఉండేలా చూడాలని కోరారు. ఈ డిమాండ్లపై చర్యలు వేగవంతం చేయాలని కోరారు. మంత్రితో చర్చ ఫలవంతమయ్యాయని, తక్షణ సమస్యలను పరిష్కరిస్తానని, సంబంధిత విధానపరమైన విషయాలపై కృషి చేస్తానని కేంద్ర మంత్రి.. ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు.

రూ. 831 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

అహ్మదాబాద్ : రెండు వేరువేరు సోదాల్లో రూ. 831 కోట్ల విలువైన లిక్విడ్ డ్రగ్స్‌ను గుజరాత్‌కు చెందిన యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఎటిఎస్) స్వాధీనం చేసుకుంది. మహారాష్ట్రలోని థానే జిల్లాలోని ఒక మెఫెడ్రోన్ తయారీ యూనిట్‌పై దాడి చేసి రూ.800 కోట్ల విలువైన డ్రగ్స్, గుజరాత్ భరూచ్ జిల్లా ఒక ఫార్మాస్యూటికల్ ఫ్యాక్టరీలో నిర్వహించిన సోదా ఆపరేషన్‌లో రూ.31 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎటిఎస్ అధికారులు బుధవారం తెలిపారు. సోమ, మంగళవారాల్లో జరిపిన సోదాల్లో నలుగుర్ని అరెస్టు చేసినట్లు ఎటిఎస్ డిఐజి సునీల్ జోషి తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డిపిఎస్) చట్టం కింద నిషేధించబడిన మాదక పదార్థాల ఉత్పత్తి, అమ్మకంలో పాల్గొన్నందుకు వీరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. జులై 18న గుజరాత్‌లోని సూరత్‌లో ఒక మెఫెడ్రోన్ తయారీ యూనిట్‌పై చేసి రూ. 51.4 కోట్ల విలువైన డ్రగ్స్, ముడి సరుకును ఎటిఎస్ స్వాధీనం చేసుకుని, ముగ్గుర్ని అరెస్టు చేసింది. జులై 29న గుజరాత్‌లోని కచ్ జిల్లా ముంద్రా పోర్టులో రెండు ఎగుమతి కంటైనర్ల నుంచి రూ 110 కోట్ల విలువైన 68 లక్షల ట్రామడాల్ టాబ్లెట్లను ఎటిఎస్ స్వాధీనం చేసుకుంది.

22(ఎ) భూముల రిజిస్ట్రేషన్లు మూడునెలలు నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువస్తుందని మంత్రి పార్థసారధి తెలిపారు.

పిల్లలెందరున్నా అర్హులే...

ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు పంచాయతీ, అర్బన్, లోకల్ బాడీస్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంటటూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని క్యాబినెట్ సమావేశం నిర్ణయించింది. ఎపి పంచాయతీరాజ్‌చట్టం -1994లోని సెక్షన్ 19కు చేసిన సవరణను కూడా రద్దు చేయాలని నిర్ణయించింది. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించడానికి గతంలో ఆ నిర్ణయాన్ని తీసుకున్నారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని మంత్రిమండలి అభిప్రాయపడింది. సంతానోత్పత్తి రేటు తగ్గుతుండటం , పనిచేయగల సామర్థ్యంఉన్న జనాబాగణనీయంగా తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల సంఖ్యపై నిషేధం అనవసరమని క్యాబినెట్ నిర్ణయించింది.

చెరువుల వేలం జిఓ రద్దు

మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించేలా చెరువులను వేలం పాటకు అనుమతిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జిఓలను రద్దుచేస్తూ క్యాబినెట్ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ జిఓలో భాగంగా నెల్లూరు జిల్లాలో 25,380 హెక్టార్ల సాగు నీటి విస్తీర్ణంతో ఎంపిక చేసిన 27 ప్రభుత్వ చెరువులను వేలం వేశారు. మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ఆయా జీఓలను రద్దు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది.

మరికొన్ని నిర్ణయాలు

- విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కళాశాలల్లో అదనంగా 380 పోస్టుల భర్తీ
- పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెల్లో నిర్మించిన నూతన వైద్యకళాశాలల్లో 100 సీట్లతో మొదటి సంవత్సరం కోర్సు ప్రారంభం.
- వైద్య కళాశాలల్లో గుజరాత్ పిపిపి మోడల్‌ను అధ్యయనం చేయడానికి చర్యలు
- నంద్యాల జిల్లా సుండిపెంట(శ్రీశైలం) గ్రామ పంచాయతీకి కేటాయించిన భూమిని రద్దు చేస్తూ జలవనరులశాఖకు బదిలీ చేసిన 208.74 ఎకరాల భూమిలో చేపట్టిన నిర్మాణాలను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా యథాతదంగా ఉంచాలి.
- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ -1992 సెక్షన్ 3 ప్రకారం కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు), రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ సంస్థలపై మరో ఏడాది నిషేధం పొడిగింపు

ప్రోగ్రెసివ్ మూవ్ ఫార్వర్డ్ పార్టీని రద్దు చేయాలి : థాయిలాండ్ కోర్టు

బ్యాంకాక్ : గతేడాది జాతీయ ఎన్నికల్లో గెలుపొందిన ప్రోగ్రెసివ్ మూవ్ ఫార్వర్డ్ పార్టీని రద్దు చేయాలని థాయిలాండ్‌లోని కోర్టు బుధవారం ఆదేశించింది. దేశ రాజ కుటుంబాన్ని అప్రతిష్టపాల్జేయడానికి వ్యతిరేకంగా చట్ట సవరణకు ప్రతిపాదించడం ద్వారా ఆ పార్టీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందని కోర్టు పేర్కొంది. పార్టీని రద్దు చేయాలని ఏకగ్రీవంగా తాము నిర్ణయించినట్లు రాజ్యాంగ కోర్టు పేర్కొంది. చట్టాన్ని సవరించాలని ఆ పార్టీ ప్రచారం చేపట్టడాన్ని దేశంలో రాజ్యాంగబద్ధమైన రాజరికాన్ని కూలదోయడానికి జరిగిన ప్రయత్నంగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. రాజరికాన్ని విమర్శిస్తే నేరంగా పరిగణించి, 15ఏళ్ల వరకు జైలు శిక్ష,జరిమానాలు విధించాలని నిబంధనలు వున్నాయి. చట్టంలో మార్పులు చేయాలని చేస్తున్న ప్రచారాన్ని ఆపాలంటూ జనవరిలోనే రాజ్యాంగ కోర్టు రూలింగ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే పార్టీపై ఎన్నికల కమిషన్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రతిపాదిత సవరణకు ప్రచారం చేసిన పార్టీ కార్యవర్గ సభ్యులపై కూడా పదేళ్ల పాటు నిషేధం విధించాలని కోర్టు రూలింగ్ ఇచ్చింది.

జోరు వానలోనూ ఇపిఎస్ 95 పెన్షనర్ల ధర్నా

- పోలీసు నిర్బంధంపై జాతీయ నాయకుల ఆగ్రహం



జోరువానలో ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జోరు వానలో, పోలీసు నిర్బంధం నడుమ అఖిల భారత ఇపిఎస్ 95 పెన్షనర్ల ఆందోళన రెండోరోజూ కొనసాగింది. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, డిఎ ఇవ్వాలని, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి జంతర్ మంతర్ వద్ద బుధవారం జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ జాతీయ అధ్యక్షులు మోహనన్ ప్రసంగించారు. అనుమతి కోసం పోలీస్ ఉన్నతాధికారులకు ముందుగా దరఖాస్తు చేశామని, సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో అనుమతించకపోగా, నిర్బంధం విధించడం సరైన విధానం కాదని అన్నారు. జాతీయ కార్యదర్శి అతుల్ దిగే మాట్లాడుతూ.. కేంద్ర కార్మికశాఖ మంత్రికి ఇపిఎస్ పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం అందజేసి చర్చించామన్నారు. కార్మిక మంత్రి మరో మూడు నెలలు సమయం కావాలని, త్వరలో దీనిపై ప్రత్యేక సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామన్నారని తెలిపారు. గత పదేళ్లుగా మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఇపిఎస్ 95 పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభించిందని విమర్శించారు. పార్లమెంటులో సిపిఎం తదితర పార్టీల ఎంపిలు ప్రత్యేక ప్రస్తావన తెచ్చినా, మోడీ ప్రభుత్వం ఇపిఎస్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ మంజూరు చేయడానికి తిరస్కరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో ఇపిఎస్ 95 పెన్షనర్ల కార్పస్ ఫండ్ రూ.7.80 లక్షల కోట్లు అని, దానిపై రూ.15 వేల కోట్ల వడ్డీ రేమో వడ్డీ రూపంలో జమవుతుందని తెలిపారు. దాని నుండి సుమారు రూ.4 వేల కోట్లు మాత్రమే పెన్షన్ల రూపంలో చెల్లిస్తున్నారని, మిగిలిన మొత్తం తిరిగి ఇపిఎఫ్ఓ నిధులకు జమ చేస్తున్నారని విమర్శించారు. ఇపిఎస్ పెన్షనర్ల సొమ్మును ఇతర ఖర్చులకు మళ్లించకూడదని డిమాండ్ చేశారు.

ఎఐసిసి జాతీయ సహాయ కార్యదర్శి కె సత్తిరాజు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 35 లక్షల మంది పెన్షనర్లు రూ.500 పెన్షన్ కూడా పొందలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. కేరళ, హర్యానా వంటి రాష్ట్రాల్లో సామాజిక పెన్షన్లను ఇపిఎస్ పెన్షన్లతోపాటు కలిపి చెల్లిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక పెన్షన్ రూ.4 వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. అంతకంటే తక్కువ ఇపిఎస్ పెన్షన్ పొందుతున్న వారందరికీ అన్ని రాష్ట్రాల్లో సామాజిక పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పెన్షన్ కోసం రూ.4 కోట్ల వరకూ ఇపిఎఫ్ఒకు చెల్లించిన విశాఖ సేల్ స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లకు కూడా మొండి చేయి చూపారని, వెంటనే బకాయిలుసహా హయ్యర్ పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పెన్షన్ కోసం సొమ్ము చెల్లించిన దేశంలోని పలు ప్రభుత్వ రంగ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసిన ఉద్యోగుల కేసులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, తెలంగాణ, పాండిచ్చేరి, ఒడిశా, హర్యానా తదితర రాష్ట్రాల పెన్షనర్లు పాల్గొన్నారు.

అఖిల్ కోసం అన్న, నాన్న



అఖిల్ చేయబోయే తదుపరి సినిమా కోసం.. నాగార్జునతో పాటు నాగచైతన్య కూడా రంగంలోకి దిగబోతున్నట్లుగా టాలీవుడ్‌లో టాక్ వినబడుతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి అనౌన్స్‌మెంట్ రానుంది. కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి హిట్టు సినిమా తీసిన మురళీ కిషోర్ చెప్పిన కథ నచ్చడంతో అఖిల్ నెక్ట్స్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా ఉండబోతుందని, ఈ సినిమాకు 'లెనిన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్‌కు అనుబంధంగా మనం ఎంటర్‌ప్రైజెస్ అనే బ్యానర్‌లో ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం.

అజిత్ 32 ఏళ్ల సినిమా జీవితం పూర్తి



కోలీవుడ్ హీరో అజిత్‌కుమార్ సినీరంగ ప్రవేశం చేసి 32 ఏళు పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్ర బృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. 32 వసంతాల అజిత్ సినీ ప్రయాణం పేరుతో దీన్ని రూపొందించారు. అందులో 32 ఏళ్ల ధైర్యం, క్రమశిక్షణ, గౌరవం... మరికొన్నేళ్లు ఇదే విధంగా కొనసాగాలని కోరుకుంటున్నాం' అని పేర్కొంది. ఈ చిత్రానికి ఆధిక్ రవిచంద్రన్ దర్శకుడు.ఇందులో హీరో త్రిపాత్రాభినయం చేస్తున్నారు. ఇప్పటివరకూ వెండితెరపై చూడని పాత్ర కూడా ఉందని చిత్ర బృందం తెలిపింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా దేవీశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. అజిత్ నటించిన మగిళ్ తిరుమేని దర్శకత్వంలో 'విడాముయర్చి' చిత్రం ఈ ఏడాది దీపావళికి విడుదల కానుంది.

9న 'పాగల్ వర్సెస్ కాదల్'



విజయ్‌శంకర్, విషిక జంటగా నటిస్తున్న సినిమా 'పాగల్ వర్సెస్ కాదల్'. లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 9న విడుదల కానుంది. శివత్రి ఫిలింస్ బ్యానర్‌పై పడ్డాన మన్మథరావు నిర్మిస్తున్నారు. రాజేశ్ ముదునూరి దర్శకత్వం వహిస్తున్నారు. బ్రహ్మాజీ, షకలకశంకర్, ప్రశాంత్ కూచిబొట్ల, అనూహ్య సారిపల్లి ఇతర కీలకపాత్రల్లో నటిస్తున్నారు. గురువారంనాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హీరో విజయ్‌శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా మీ ముందుకొస్తోంది. నేను కార్తీక్ అనే క్యారెక్టర్‌గా నటిస్తున్నా. సినిమా ప్రేమలో ఉన్న ప్రతి లవర్ రిలేజ్ చేసుకునేలా ఉంటుంది. ప్రియ పాత్రలో విషిక అద్భుతంగా నటించంది. 'పాగల్ వర్సెస్ కాదల్' సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరించాలని కోరుతున్నా' అన్నారు.

సినిమా చెట్టుకు మళ్లీ జీవం!



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి తీరంలో ఉన్న ఒక చెట్టు వరదల కారణంగా కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ చెట్టు కేంద్రంగా సుమారు 300 సినిమాలను షూటింగ్ జరిపారు. తాజా సమాచారం ప్రకారం నేలకూలిన ఈ సినిమా చెట్టుకు జీవం పోయడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టి సినిమా చెట్టు చిగురింప చేయటానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. 300 సినిమాలు చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా చెట్టు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా నేలకొరిగిన సినిమా చెట్టును పరిశీలించిన కలెక్టర్ పి. ప్రశాంతి మళ్లీ సినిమాలు చిత్రీకరణకు అణువుగా సినిమా చెట్టుకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె ఆదేశాలతో త్వరలోనే అధికార యంత్రాంగం కార్యచరణకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న ఆధునిక పద్ధతులతో ఇలాంటి ప్రమాదాలు కారణంగా నేలకొరిగిన చెట్టును మళ్లీ నిలబెట్టడం పెద్ద విషయమేమీ కాదు. కాకపోతే కాస్త ఖర్చవుతుంది.

వినేశ్ వెనుక దేశం



పతకం చేజారినా.. కోట్లాదిమంది మద్దతు ఆమెకే..

పారిస్: పతకం చేజారుతుందనుకున్న సాకుతో వినేశ్ ఫోగాట్ జుట్టును కత్తిరించారు... ఆహారం ఇవ్వలేదు... నీరు కూడా పరిమితంగానే అందించారు. బరువు తగ్గింపుకు రాత్రంతా ఎక్సర్‌సైజ్‌లు, జాగింగ్, స్కిప్పింగ్, సైక్లింగ్ ఇతరత్రా ఎక్సర్సయిజ్‌లలో ఫోగాట్‌ను నానా హింసలకు గురిచేశారు. చివరకు 100గ్రాముల అధిక బరువుతో అనర్హత వేటుకు గురైంది వినేశ్ ఫోగాట్. ఈ విషయమై ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఎ) డాక్టర్ పార్ధీవాలాబుధవారం జారీ చేసిన ఓ ప్రకటనలో.. పోటీలో పాల్గొన్న తర్వాత నిర్దేశిత బరువు కంటే 2.7కిలోలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. బరువు తగ్గించడానికి చాలా సమయం పడుతుంది. కానీ దురదృష్టవశాత్తు మా చేతిలో 12గంటలు మాత్రం ఉంది. వెంటనే కోచ్ అన్ని చర్యలు తీసుకున్నారు. నీరు పరిమిత స్థాయిలో ఇచ్చాం. ఆహారం ఇవ్వలేదు. చెమట కోసం వ్యాయామాలు, ఆవిరి స్నానం వంటి మార్గాలతో బరువు తగ్గించేందుకు ప్రయత్నించాం. ఆమె శరీరం నుంచి చెమట రావడం లేదని గుర్తించి చివరకు జుట్టును కూడా కత్తిరించాం. అయినప్పటికీ 50 కేజీల విభాగంలో ఆమె 100 గ్రాములు ఎక్కువ ఉన్నట్లు వెల్లడైంది. దాంతో అనర్హతకు గురైంది. మరికొంత సమయం ఉంటే ఆ కొంత బరువును కూడా తగ్గించేవాళ్లం" అని వివరణ ఇచ్చారు. ఇక మూడో ఒలింపిక్స్ ఆడుతున్న వినేశ్ ఫోగట్ ఈసారి 53 కిలోల బదులు 50 కిలోల విభాగంలో బరిలోకి దిగింది. తొలి బౌట్‌లోనే వరల్డ్ నంబర్ వన్ లీ సుసానీకి చెక్ పెట్టిన వినేశ్.. ఆ తర్వాత ఉక్రెయిన్ రెజ్లర్ ఒక్సానా లివాచ్‌ను మట్టికరిపించింది. ఇక సెమీ ఫైనల్లోనూ ఉడుంపట్టుతో విజృంభించిన ఆమె క్యూబా రెజ్లర్‌ను 5-0తో చిత్తు చేసింది. దాంతో, ఫైనల్‌కు చేరిన భారత తొలి మహిళా రెజ్లర్‌గా వినేశ్ రికార్డు నెలకొల్పింది.

క్రీడా ప్రముఖుల సంఘీభావం

ప్రజలకు నిజమైన ఛాంపియన్‌గా ఉండటానికి కొన్ని సార్లు మీకు బంగారు పతకమే అవసరం లేదు

- ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, మాజీ షూటర్ అభినవ్ బింద్రా

డియర్ వినేశ్.. మాకు నువ్వెప్పటికీ ఛాంపియన్‌వే. ఈ ఒలింపిక్స్‌లో తప్పకుండా స్వర్ణం సాధిస్తావని బలంగా నమ్మా. నీతో ఉన్న కొద్ది సమయంలోనే నేనెంతో స్ఫూర్తి పొందా. ఎల్లప్పటికీ మద్దతుగా ఉంటా **- స్టార్ షట్లర్ పీవీ సింధు**

గుండె బద్ధలైంది **- బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్**

ఇది చాలా దురదృష్టకరం. వినేశ్‌కు అన్యాయం జరిగింది. ఇదేం తొలి రౌండ్ కాదు. వరల్డ్ మెడల్ సాధించే మ్యాచ్. దీన్ని మనం తేలిగ్గా తీసుకోకూడదు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద భారత్ తమ నిరసనను బలంగా వినిపించాలి.

- టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్

విచారణ జరగాలి: డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్

వినేశ్ తప్పు చేసినట్లు భావించడం లేదని, మొత్తం వ్యవహారంపై విచారణ జరగాలని డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షులు సంజయ్ సింగ్ కోరారు. 'రెండు రోజుల పాటు ఆమె బరువు స్థిరంగానే ఉంది. రాత్రికి రాత్రి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీనికి కారణమేంటనేది ఆమె కోచ్, న్యూట్రిషనిస్ట్, సహాయక సిబ్బందే వివరణ ఇవ్వాలి. దీనిపై విచారణ జరగాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నా.. అలాగే వినేశ్ వ్యవహారంపై న్యాయపరంగా ముందుకు వెళ్లనున్నట్లు, ఇప్పటికే భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు దీనిపై చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న వినేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, అన్ని విధాలా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

పిటి ఉషకు ప్రధాని ఫోన్..

తాజా పరిణామాల వేళ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉషతో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. వినేశ్‌పై అనర్హతకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసిన ప్రధాని.. దీన్ని సవాల్ చేసేందుకు భారత్‌కు ఉన్న అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వినేశ్‌కు ఉపయోగపడుతుందనుకుంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద భారత్ నిరసనను బలంగా వ్యక్తపర్చాలని పిటి ఉషకు సూచించినట్లు సమాచారం. ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో వినేశ్ ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఈ ఉదయం పోటీదారుల బరువును పరీక్షించారు. ఇందులో ఆమె కొన్ని గ్రాముల అదనపు బరువు ఉండటంతో అనర్హత వేటు పడింది. దీంతో పతకం చేజారింది.

పతకాలు ఎవరెవరికి దక్కుతాయి..

వినేశ్‌పై అనర్హత వేటు పడినా అమెరికా క్రీడాకారిణి సారా హిల్డర్ బ్రాంట్ స్వర్ణపతకం ఇంకా ఖాయం కాలేదు. ద్వితీయ స్థానంలో రజత పతకం ఎవరికి దక్కుతుందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. యూనైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్(యుడబ్ల్యుడబ్ల్యు) నిబంధనల ప్రకారం బరువు ప్రమాణాలను అందుకోని క్రీడాకారిణిపై అనర్హత వేటు వేస్తారు. అంతేకాదు.. ఆ పోటీల్లో చివరి ర్యాంక్‌ను ఇస్తారు. ఫైనల్స్ నుంచి బయటకు వెళ్లిపోయిన వినేశ్‌కు రజత పతకం ఇవ్వరు. అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనల్లో ఆర్టికల్ 11 ప్రకారం.. క్వార్టర్ ఫైనల్స్‌లో వినేశ్ చేతిలో ఓడిపోయిన గుజ్మన్ లోపేజ్ (క్యూబా)కు అమెరికాకు చెందిన సారా హిల్డర్ బ్రాంట్‌కు ఫైనల్స్ జరుగుతుంది. కాంస్యపతక పోరులో జపాన్ క్రీడాకారిణి సుసాకీ, ఉక్రెయిన్‌కు చెందిన ఒక్సాన తలపడనున్నారు. ఈ విషయాన్ని ఒలింపిక్ నిర్వాహకులు ప్రకటించాల్సి ఉంది. అటు వరల్డ్ రెజ్లింగ్ చీఫ్ నేనాడ్ లలోవిక్ కూడా దీనిపై స్పందించారు. "ఆమెకు జరిగింది బాధాకరమే అయినప్పటికీ.. నిబంధనలను మనం గౌరవించాలి. ఆమె కేవలం 100 గ్రాముల బరువు అధికంగానే ఉంది. అయినా రూల్స్ ప్రకారం పోటీలో ఉండేందుకు అనుమతించరు. ఫైనల్‌కు వచ్చిందని చెప్పి ఆమెకు మెడల్ ఇవ్వడం అసాధ్యం. రూల్స్ అందరికీ ఒకటే" అని లలోవిక్ తెలిపారు.

వన్డే సిరీస్ చేజారె..

- మూడో వన్డేలో 110పరుగుల తేడాతో టీమిండియా ఓటమి
- 27ఏళ్ల తర్వాత శ్రీలంకకు వన్డే సిరీస్



కొలంబో: శ్రీలంక జట్టు 27ఏళ్ల తర్వాత భారత్‌పై స్వదేశంలో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా 110 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 248పరుగులు చేయగా.. ఛేదనలో భారత్ 26.1ఓవర్లలో 138పరుగులకే కుప్పకూలింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను శ్రీలంక జట్టు 2-0తో చేజిక్కించుకోగా.. తొలి వన్డే టై అయ్యింది. శ్రీలంక ఓపెనర్లు అవిష్క ఫెర్నాండో(94), పథుమ్ నిశాంక(45)లు శ్రీలంకకు శుభారంభమిచ్చినా మిడిలార్డర్ చేతులెత్తేశారు. ఆఖర్లో కుశాల్ మెండిస్(59), కమిండ్ మెండిస్(23 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. దాంతో, శ్రీలంక పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది. రియాన్ పరాగ్‌కు మూడు, సిరాజ్, అక్షర్, సుందర్, కుల్దీప్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. లంక నిర్దేశించిన 249 పరుగుల ఛేదనలో ఓపెనర్లు రోహిత్ శర్మ(35), శుభ్‌మన్ గిల్(6)లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. అవిష్క ఫెర్నాండో ఓపెనర్ గిల్‌ను బౌల్డ్ చేసి 37 పరుగుల వద్ద తొలి వికెట్ తీశాడు. ఆ తర్వాత దునిత్ వెల్లలాగే(5/27) స్పిన్ మాయ చేస్తూ హిట్‌మ్యాన్ వికెట్ తీసి లంకను పోటీలోకి తెచ్చాడు. దాంతో 53కే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను విరాట్ కోహ్లి(20), పంత్‌లు ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, థీక్షణ బౌలింగ్‌లో పంత్ స్టంపౌట్ కాగా పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయింది. తీక్షణ, ఛరితకు రెండేసి, ఫెర్నాండోకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫెర్నాండోకు సిరీస్ వెల్లెలగేకు లభించాయి.

పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. అమెరికా	24	32	32	88
2. చైనా	23	22	16	61
3. ఆస్ట్రేలియా	17	12	10	39
4. ఫ్రాన్స్	13	16	19	48
5. బ్రిటన్	12	16	19	47
6. ద.కొరియా	11	8	7	26
7. జపాన్	11	6	12	29
8. ఇటలీ	9	10	8	27
9. నెదర్లాండ్స్	9	5	6	20
10. జర్మనీ	8	5	4	17
64. ఇండియా	0	0	3	3

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

చిన్నారి



జంబాలకోరు పిండె



అమ్మపాలెం శివారు కొండల్లో పల్లపు దుంగాడ అనే గిరిజన గ్రామం ఉండేది. ఎటువంటి రవాణా సౌకర్యాలు లేని ఆ గ్రామానికి వెళ్ళాలి అంటే నడచి వెళ్లాల్సిందే! ఆ గ్రామంలో ఉన్న వీర్రాజుకి చిన్నప్పటి నుంచి గొప్పగా బతకాలని, నాయకుడిగా ఎదగాలని కల. యుక్త వయసు నుంచి మీసాలు పెంచి, వీరుడిలా పైకి తిప్పేవాడు. ఇంట్లో ఇబ్బందులు ఎన్ని ఉన్నా, దాచుకున్న డబ్బులతో పట్నం నుంచి ఖరీదైన సంపెంగ నూనె తెప్పించి, మీసాలకు రాసుకుని, చలువ బట్టలు ధరించి దర్జాగా తిరిగేవాడు. తన గురించి తాను గొప్పలు చెప్పుకునేవాడు. ఆ ఊళ్ళో వాళ్లు అందరూ మీసాల వీర్రాజు అని పిలవడం మొదలు పెట్టారు. ఆ గ్రామంలో కాస్త తెలివైన వాడు, శుభ్రమైన బట్టలు కట్టుకుని హుందాగా ఉండేవాడు కాబట్టి అతడిని గ్రామస్తులందరూ కలసి గ్రామ పెద్దగా నిర్ణయించారు. దాంతో పనీ పాట మానేసి ఊరి మీద తిరగడం మొదలు పెట్టాడు.

ఇది చూసిన ముసలి వాళ్ళు 'వీర్రాజూ 'తడి తక్కువ తమాషా ఎక్కువ' అంటే ఇదే. నీకు 'మింగడానికి మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె ఎందుకు?' అని అడిగేవారు.

'తాతా... నేను తిన్నానో, ఆకలితో ఉన్నానో లోకానికి తెలియదు. కానీ నేను హుందాగా, ఉండబట్టి నన్ను గ్రామస్తులంతా నాయకుడుగా గుర్తించారు. నేను ఇలాంటి జీవితం కోసం కలలు కన్నాను. అన్నం లేకపోయినా పరవాలేదు. అందరిలో గొప్పగా ఉండాలి, అందరూ నన్ను గుర్తించాలి. మీగడ పెరుగులు లేక పోయినా పరవాలేదు మీసాలకు సంపెంగ నూనె రాయాలి. ఆస్తి లేక పోయినా పరవాలేదు అప్పు చేసైనా పప్పు కూడు తినాలి. ఎవరేమనుకున్నా ఇదే నా జీవన విధానం తాతా' అంటూ ముందుకు కదిలాడు వీర్రాజు.

ఈవిధమైన మనస్తత్వం గలవారినే 'జంబాలుకోరు పిందె' అంటారు. తనకు తిండికి కూడా గతి లేకున్నా పైకి మహా ఆర్భాటంగా కనిపించే ప్రయత్నం చేసే గిరీశం బోటి వాళ్లను అనే వెటకారపు మాట ఇది. సంపెంగ నూనె ధర ఎక్కువ. తిండి గింజలు కొనుక్కోలేక పోయినా డాబుగా బట్టలు ధరించడం, గొప్పలు చెప్పుకోవడం చేసే వ్యక్తుల విషయంలో తడి తక్కువ తమాషా ఎక్కువ లేదా మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె అనే జాతీయం వాడుతారు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.



నీడ కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ రకరకాల మాస్కులు ధరించిన పిల్లల బొమ్మలు ఉన్నాయి. వారికి సరిగ్గా సరిపోయే నీడలు కిందనే ఉన్నాయి. ఏ బొమ్మకి ఏ నీడో జత చేయండి. చూద్దాం.

నేను గీసిన బొమ్మ





పి.ప్రేమ్ తేజ్,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
కుల్చారం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



జీవన the family

మెరుగైన సమాజం కోసం ...



'సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి తోడు పడవోయ్' అన్న గురజాడ మాటను ఆచరణలో చూపిస్తున్నారు ఆ అమ్మా, కుమారుడు. అనంతపురం వాసి అనిల్‌కుమార్ పర్యావరణ పరిరక్షణ కోసం తపన పడుకుంటే... ఆయన తల్లి ప్రమీలమ్మ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తన వంతు సహాయం అందిస్తున్నారు. సమాజ అభివృద్ధికి తల్లీ, కొడుకు ఇలా తమ వంతు భాగస్వామ్యం అందించటాన్ని పలువురు అభినందిస్తున్నారు.

అనిల్ కుమార్‌కి చెట్లు, పక్షులు అంటే అమితమైన ప్రేమ. అడ్డుగా వుందని తొలగించిన 40 సంవత్సరాల చెట్టును సొంత ఖర్చుతో తన ఇంటి వద్ద తిరిగి నాటి సంరక్షించుతున్నారు ఆయన. అనిల్ తండ్రి శ్రీనివాసరెడ్డి కూడా వివిధ రూపాల్లో ప్రజాసేవ చేసినవారే. ఆ వారసత్వాన్నే తాను కొనసాగిస్తున్నట్టు అనిల్ చెబుతున్నారు. ఉన్నత చదువు చదివిన ఆయన ప్రజలకు ప్రభుత్వం నుంచి సౌకర్యాలు, సంక్షేమం సక్రమంగా అందేలా సోషియల్ మీడియా వేదికగా ప్రశ్నించే గొంతుక అయ్యారు. 'హరిత అనంత' లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. డిస్కవర్ - అనంతపురం ఫేస్‌బుక్, ఇన్‌స్టా సోషల్ మీడియా వేదికగా అనేక చైతన్య కార్యక్రమాలను నడుపుతున్నారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

చెట్ల సంరక్షణలో ...

చెట్లు పర్యావరణాన్ని కాపాడతాయి. జీవులకు ఆసరాగా నిలుస్తాయి. వాటిని సంరక్షించుకోవడం చాలా అవసరమని భావిస్తున్న అనిల్ కుమార్ 'హరిత అనంత' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎక్కడైనా ఏ కారణంతోనైనా చెట్లను తొలగిస్తున్నట్టు తమకు ట్రీ హెల్ప్ లైన్ ద్వారా సమాచారం అందిస్తే- వెంటనే వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆరు మహా వృక్షాలను ట్రీ ట్రాన్స్ లొకేషన్ పేరుతో స్థల మార్పిడి చేసి సంరక్షించారు. రహదారులకు, నిర్మాణ పనులకు అడ్డంగా ఉన్నాయన్న పేరుతో చెట్లను నరికివేయడం జరుగుతూ ఉంటుంది. అలాంటి వాటిని వేరు ఖాళీ ప్రదేశాల్లోకి మార్పిడి చేయాలన్నది 'హరిత అనంత' ప్రాజెక్టు ఉద్దేశం. ఈ ఏడాది 100 వృక్షాలను స్థల మార్పిడి చేసి, రక్షించాలనే సంకల్పంతో ఉన్నట్టు అనిల్ చెప్పారు.

"అనంతపురంలో రోడ్డు విస్తరణలో భాగంగా 800 మహా వృక్షాలను తొలగించారు. ఇది మాకు చాలా బాధ కలిగించింది. అలాంటి చెట్లు తయారు కావాలి అంటే ఎన్నో ఏళ్లు పడుతుంది. కాబట్టి ఉన్న చెట్లను రక్షించుకోవాలని కార్యక్రమం చేపట్టాం. డిస్కవరి అనంతపురం, గ్రీన్ ఆర్మీ, ప్లాస్టిక్ రహిత అనంత కోసం, హోం ఫర్ బర్డ్స్, నెయిల్ ఫ్రీ ట్రీ, మహిళలకు టాయిలెట్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గ్రీన్ ఆర్మీ, డిస్కవరి అనంతపురం ద్వారా మూడు సంవత్సరాలలో 64 వేల మొక్కలను నాటాం. మొక్కలను నాటటంతో పాటుగా వాటిని పరిరక్షించిన వారికి ప్రోత్సాహంగా రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున ఏటా పది మందికి ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నాం' అని అనిల్ కుమార్ వివరించారు..

పక్షులకు గూళ్లు

పక్షులను, పక్షి జాతులను సంరక్షించే కార్యక్రమంలో భాగంగా కన్యాకుమారి, అలిపిలో పక్షి సంరక్షణ కోసం గూళ్లను తయారు చేయించి పట్టణ ప్రాంతాలలో పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో 78 వేలు, తెలంగాణలో 11 వేలు, కర్ణాటకలో 8 వేల పక్షి గూళ్లను పంపిణీ చేశారు.



చెట్లకు మేకులు కొట్టొద్దు

చెట్లకు మేకులు కొట్టడం చాలా నష్టం కలిగిస్తుందని ... అలా మేకులు కొట్టే అలవాటుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు అనిల్ కుమార్. ఉద్యోగ బాధ్యతల్లో ఉన్న సమయంలో బెంగళూరులో నెయిల్ ఫ్రీ ఫర్ ట్రీస్ కోసం మిత్రులతో కలిసి ఉద్యమం చేశారు. ఫలితంగా అక్కడి ప్రభుత్వం చట్టం చేసింది. ఇప్పటి వరకు మూడు వేలకు పైగా చెట్ల నుంచి మేకులను తొలగించారు.

ప్లాస్టిక్ లేని అనంతపురం కోసం అనిల్ బృందం ఉద్యమం చేపట్టింది. ప్రజల కర్తవ్యం, అధికారుల బాధ్యతను గుర్తు చేస్తూ ప్రచారం నిర్వహించారు. 200 మంది పానీ పూరి వ్యాపారులకు వక్క ప్లేట్లు అందించారు. ప్లాస్టిక్ వాడొద్దని అవగాహన కల్పించారు. గడ్డి స్ట్రాలు, పేపర్ పెన్నులను పంపిణీ చేశారు.

రిటైర్ అవుదామనుకున్నా...

'సొంత ఊరు చేరుకుని విశ్రాంతి తీసుకుందామని అనుకున్నాను. ఎనిమిదో తరానికి చెందిన వాడిని. నా ఆలోచనలు చిన్ననాటి నుంచి భిన్నంగా వుండేవి. ప్రధానంగా ప్రశ్నించే తత్వం నాది. బహుశా అందుకే చదువు, ఉద్యోగం, వివాహం తరువాత రిటైర్ అవుదామని అనుకున్నాను. కానీ అనంతపురం రాగానే ఇక్కడి సమస్యలు చూసిన తర్వాత మనసు ఆగలేదు. భవిష్యత్తు తరాలకు మనమందించే సమాజం ఇదేనా అని బాధపడ్డాను. అందుకే సామాజిక సేద్యం మొదలు పెట్టాను. నాకు ఎవ్వరూ శత్రువులు కాదు. హక్కులు, బాధ్యతలను గుర్తు చేయటంలో విమర్శలు వచ్చినా నా అడుగు ఆగదు' అంటూ తన భవిష్యత్తు కార్యాచరణను చెప్పారు అనిల్ కుమార్.

ప్రశ్నించే గొంతుకగా..

అనిల్ కుమార్ టాటా, ఎయిర్‌టెల్, సంగీతా వంటి కంపెనీలలో ఉన్నత స్థాయి విధులు నిర్వర్తించారు. 20 సంవత్సరాలు పనిచేశారు. విశ్రాంతి తీసుకుందామని అనుకున్న తరుణంలో కుటుంబం మిత్రుల అండతో సామాజిక సేద్యానికి శ్రీకారం చుట్టారు. 1997లో గ్యాస్ వినియోగదారులకు జరుగుతున్న అన్యాయంపై మొట్టమొదటిసారి అనిల్ కుమార్ గళమెత్తారు. బెంగళూరులో నెయిల్ ఫ్రీ ట్రీస్ ఉద్యమం చేసి 2018-19లో ప్రభుత్వం చట్టం తీసుకురావటంలో సఫలం అయ్యారు.

చరిత్ర పుటలపై మక్కువతో పురాతన కట్టడాల సంరక్షణకు కూడా అనిల్ శ్రీకారం చుట్టారు. 18వ శతాబ్దానికి చెందిన కాశీవిశ్వేశ్వర స్వామి కోనేరు, 14వ శతాబ్దానికి చెందిన మరో కోనేరు పూడికతీత చేసి 300 అడుగల బోరు వేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అనంతపురానికి సమీపంలో బళ్లారి రోడ్డులోని 19వ శతాబ్దానికి చెందిన వంతెన పునర్నిర్మాణం సొంత నిధులతో జరిపించారు.

చదువుల తల్లి ప్రమీలమ్మ

అనిల్ కుమార్ తల్లి ప్రమీలమ్మకు ఇప్పుడు ఎనభై ఏళ్లు. తన వృద్ధాప్యాన్ని సైతం మర్చిపోయి విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. 60కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో మూడున్నర లక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. 45 వేల పేపర్ పెన్నులు, 7 వేల డిజిటల్ స్లేట్స్ విద్యార్థులకు అందించారు. వివిధ పాఠశాలల్లో 14 లైబ్రరీలు, 3 సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్రీడలలో రాణించటం కోసం 300 స్పోర్ట్స్ కిట్లు అందించారు. మెరుగైన సమాజం తన లక్ష్యమని, భర్త అడుగు జాడల్లో తమ వంతు సామాజిక బాధ్యతగా తాను జీవించి ఉన్నంత కాలం సేవ చేస్తానని ప్రమీలమ్మ చెబుతున్నారు.

- రవిచంద్ర, అనంతపురం 94900 99611.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68